


భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక








సంపుటి: 3 సంచిక: 296 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు బుధవారం, 19 ఆగష్టు 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 296 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR WEDNESDAY, 19 AUGUST 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI




# బీసీలకు రాజకీయ సాధికారత

## రిజర్వేషన్ల కల్పన గొప్ప నిర్ణయం

## ఐటిశాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి: బీసీలకు రాజకీయ సాధికారత కల్పించడంతో పాటు స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర కేబినెట్ నిర్ణయించిందని లోకేశ్ తెలిపారు. అలాగే పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు ఈ నిర్ణయం గొప్ప అవకాశంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీల భాగస్వామ్యం పెరగడం ద్వారా నిర్ణయాధికారంలో వారికి మరింత ప్రాధాన్యం లభిస్తుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు అండగా నిలుస్తోందని నారా లోకేశ్ అన్నారు. బీసీల సంక్షేమం, రాజకీయ సాధికారత కోసం పార్టీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 'ప్రజా ప్రభుత్వం బీసీలకు జై కొట్టింది.. జయహో బీసీ అంటోంది' అని లోకేశ్ పేర్కొన్నారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం?1994కు అనుగుణంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ముఖ్యమైన అంశమని మంత్రి వివరించారు. నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో మేయర్లు, చైర్మన్లను ఇకపై ప్రత్యక్ష ఎన్నికల విధానంలో ఎన్నుకునేలా నిర్ణయం తీసుకున్నట్లు లోకేశ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రస్తుత 13 జిల్లా పరిషత్‌లను 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతించారు. ఇది బీసీల సామాజిక న్యాయం, రాజకీయ సాధికారత దిశగా మరో కీలక అడుగని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్‌తో లక్షలాది బీసీ కుటుంబాల చిరకాల స్వప్నాలు సాకారం కానున్నాయని అన్నారు. ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు టీడీపీ బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. బీసీల హక్కులను కాపాడటమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలను వంచించిందని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా జగన్ మోసం చేశారని పల్లా శ్రీనివాసరావు విమర్శించారు.





# స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34%

బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం

ఎన్నికల హామీ మాత్రమే కాదు.... తమ రాజకీయ సిద్ధాంతం

ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పకొనే రోజు ఇది

టిడిపి వచ్చిన తరవాతనే ఎందరో బిసి నేతలుగా ఎదిగారు

అసెంబ్లీ చర్చలో సిఎం చంద్రబాబు నాయుడు

**హామీలు ఇవ్వడంతోనే ఆగిపోకుండా వాటిని అమలు చేసి చూపిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం బిసిలకు రిజర్వేషన్ల విషయంలో చేసిన అన్యాయన్ని సరిచేయడానికి ప్రత్యేక క్యాబినెట్ పెట్టి నిర్ణయం తీసుకున్నట్లు సీఎం చెప్పారు. 2024 ఎన్నికల్లో ఈ స్థాయి గెలుపుకు కారణం బిసిల వల్లేనని చెప్పకొచ్చారు. 94శాతం స్ట్రయిక్ రేట్ 57శాతం ఓట్లు వచ్చాయంటే అది బిసిల వల్ల, నాయకత్వంపై ఉన్న నమ్మకం వల్ల మాత్రమేనని పేర్కొన్నారు. బిసిలకు న్యాయం చేయాలని తాను, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బీజేపీ నేతలు ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకున్నామన్నారు.**

అమరావతి: బీసీలకు అండగా ఉంటామని తమ ప్రభుత్వం మరోసారి రుజువు చేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు అంశంపై
శాసనసభలో జరిగిన చర్చలో సీఎం మాట్లాడారు. బీసీల జీవితాల్లో మార్పు తెచ్చే అతిపెద్ద నిర్ణయం ఇది అని చెప్పారు. ఇది ఎన్నికల హామీ మాత్రమే కాదని.. తమ రాజకీయ సిద్ధాంతమన్నారు. హామీ ఇవ్వడమే కాకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయమని.. ప్రతి బీసీ కుటుంబం గర్వంగా చెప్పుకొనే రోజు ఇది అని చెప్పారు. తెదేపా రాకముందు రాజకీయ అధికారం కొన్ని వర్గాలకే పరిమితమైంది. ఎన్టీఆర్ వచ్చాకే బీసీలకు ఆ అవకాశం దక్కింది. మా పార్టీలో ఎంతోమంది బీసీలు నేతలుగా ఎదిగారు. ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, కేఈ కృష్ణమూర్తి, అయ్యన్నపాత్రుడు, కళా వెంకట్రావు, దేవేందర్‌గౌడ్ ఉన్నత స్థాయికి చేరుకున్నారు. 1995లో బీసీలకు ఉన్న 20 శాతం రిజర్వేషన్లను 34 శాతానికి పెంచామన్నారు. తెదేపా పాలనలో బీసీల అభ్యున్నతికి అనేక కార్యక్రమాలు చేపట్టాం. కులవృత్తులు, చేతివృత్తులకు అండగా నిలిచాం. బీసీలకు ఆదరణ కింద 341 పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చాం. బీసీల కోసం రూ.32 వేల కోట్లు ఖర్చు చేశాం. వడ్డెర్లకు 10 శాతం మైనింగ్ లీజులు ఇస్తున్నాం. నేతన్న సేవ కింద ప్రతి కుటుంబానికి రూ.25 వేలు అందజేస్తున్నాం. మత్స్యకారులకు ప్రతి దశలోనూ అండగా ఉంటున్నాం. 217 జీవో రద్దు చేసి మత్స్యకారులను ఆదుకున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణుల జీతాలను రూ.25వేలకు పెంచాం. బీసీలు సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేసుకుంటే రూ.95వేల రాయితీ ఇస్తున్నాం. బీసీలకు విద్య, నైపుణ్యం, ఉపాధి, వ్యాపార, రాజకీయ ప్రాతినిధ్యం ఇస్తాం. మేం తెచ్చిన బీసీ రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదు. రాజ్యాంగ పరిమితులు పాటిస్తూనే సామాజిక న్యాయం చేస్తున్నాం. సమాజంలో ప్రతి వర్గానికీ అవకాశం కల్పించాలనేది మా లక్ష్యం' అని చంద్రబాబు అన్నారు. అందుకే బీసీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు నాయుడు అన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం కేవలం ఎన్నికల హామీ కాదని, అది తమ రాజకీయ సిద్ధాంతంలో భాగమని చంద్రబాబు స్పష్టం చేశారు.



2లో..

# రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు

కోనసీమ కొబ్బరి రైతులకు అండగా ప్రభుత్వం

దెబ్బతిన్న చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటడమే లక్ష్యం

ఒక్కో మొక్కకు రూ.1,000 సాయం..

కాలువల్లో పూడికతీతతో

ఉప్పునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

శాసనసభలో వ్యవసాయ శాఖ

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




# పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం

టిఆర్ఎస్ అధికారంలోకి వస్తే భూలక్ష్మి కింద ఎకరం పంపిణీ

పేదల భూములను లాక్కుంటూ పోతే చూస్తూ ఊరుకోం

టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హెచ్చరిక



# పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి

నిషేధిత జాబితా భూములకు నైతిక బాధ్యత వహించాలి

సారీలు చెప్పి సరిపుచ్చుకోవడం కుదరదు

బాధితుల కోసం జనతా గ్యారేజ్ తెరిచే ఉంటుంది

బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్



2లో..

# చరిత్రలో బీసీలు మరిచిపోలేనిరోజు

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై హర్షం గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు

# ఎన్టీఆర్ పార్టీ పెట్టాకనే బీసీలకు పెద్దపీట

అమరావతి: బీసీలకు తెలుగుదేశం పార్టీ హయాంలోనే న్యాయం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బీసీ సాధికారత రిజర్వేషన్లపై మంత్రి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పార్టీ పెట్టాక బలహీనవర్గాలను అసెంబ్లీకి పంపారని.. స్థానిక సంస్థలలో 20 శాతం రిజర్వేషన్లు ఇచ్చారని తెలిపారు. 1995లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 34 శాతం రిజర్వేషన్లను కల్పించారని గుర్తుచేశారు. గతంలో ఉన్న చట్టంలో మార్పు చేయాలంటే .. సవరణ చేయాలన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక బలహీనవర్గాలపై దాడులు చేశారని, దమనకాండ చేశారని మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ పుట్టినప్పటి నుంచి టీడీపీకి అండగా ఉన్న వర్గం బీసీలు అని అన్నారు. అందుకే బీసీలపై వైసీపీ కక్ష కట్టిందని విమర్శించారు. బలహీన వర్గాలకు అండగా ఉంటామని చెప్పి రిజర్వేషన్లను పెంచారని, అయితే చట్టాన్ని మార్పు చేయాల్సి ఉండగా అలా చేయకుండా కొత్త జీవో ఇచ్చారని గత ప్రభుత్వంపై మంత్రి మండిపడ్డారు. ఆ రిజర్వేషన్లు వద్దు అని చెప్పి వైసీపీ సానుభూతిపరుడితోనే కోర్టులో కేసులు పెట్టించారన్నారు. కోర్టులో ఎదురుదెబ్బ తగిలితే సుప్రీంకోర్టుకు వెళ్లలేదని... తద్వారా బీసీలకు అన్యాయం చేశారని విమర్శించారు. నేడు కేబినెట్ సమావేశాన్ని ప్రత్యేకంగా పెట్టి స్థానిక సంస్థలలో
బీసీలకు రిజర్వేషన్ల కల్పనపై చర్చించి నిర్ణయం తీసుకున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బలహీనవర్గాలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండాలని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు

అమరావతి: కోనసీమలో కొబ్బరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ, దెబ్బతిన్న ప్రతి కొబ్బరి చెట్టు స్థానంలో కొత్త మొక్క నాటించడంతో పాటు కాలువలు, డ్రెయిన్ల పూడికతీత ద్వారా సమస్య మూలాలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో 1.18 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగు జరుగుతుండగా, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే 0.36 లక్షల హెక్టార్లలో కొబ్బరి సాగవుతోందని మంత్రి తెలిపారు. కోనసీమ జిల్లాలో సుమారు 10 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు కౌలు రైతుల ద్వారా సాగవుతున్నాయని వివరించారు.గత ఐదేళ్లుగా కాలువల్లో సక్రమంగా పూడికతీత చేపట్టకపోవడంతో సముద్రపు ఉప్పునీరు బ్యాక్ వాటర్ రూపంలో వెనక్కి వచ్చి నేలలో లవణీయత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. దీని ప్రభావంతో పైకి ఆరోగ్యంగా కనిపించే కొబ్బరి చెట్లు కూడా అకస్మాత్తుగా కుంగిపోయి చనిపోతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యను తాను స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించానని, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఆయా ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. దెబ్బతిన్న ప్రతి కొబ్బరి మొక్క స్థానంలో కొత్త మొక్క నాటేందుకు ఒక్కో మొక్కకు రూ.1,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. కొత్త మొక్కలు నాటడంతోనే సమస్య పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. కాలువలు, డ్రెయిన్లలో పూడిక తొలగించకుండా ఎన్ని మొక్కలు నాటినా, ఎంత పెట్టుబడి పెట్టినా ఆశించిన ఫలితం ఉండదన్నారు. అందుకే సమస్యకు మూలమైన డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మొదటి విడతలో శంకరగుప్తం కాలువ పనులకు నిధులు కేటాయించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇప్పటికే శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ పనులు పూర్తయితే రెండు, మూడు నియోజకవర్గాల్లో ఉప్పునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. మిగిలిన కాలువలను కూడా ఒక సమగ్ర ప్రాజెక్టుగా చేపట్టి శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.కొబ్బరి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. కొబ్బరి అభివృద్ధి మండలి (అఃః) సహకారంతో 2017-18 నుంచి 2024-25 వరకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 5,250 హెక్టార్లను పథకం పరిధిలోకి తీసుకొచ్చినట్లు వివరించారు. కొత్త కొబ్బరి తోటల విస్తరణకు హెక్టారుకు రూ.56 వేల సబ్సిడీని రెండేళ్లలో రూ.28 వేల చొప్పున రెండు సమాన వాయిదాల్లో అందిస్తున్నామన్నారు. ఉద్యానవన తోటల విస్తరణకు సంబంధించిన కార్యక్రమం కింద గుంటలు తవ్వడం, మొక్కలు నాటడం, సాగు పరికరాలు తదితరాలకు మూడు సంవత్సరాల పాటు హెక్టారుకు రూ.2,47,950 వరకు ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందన్నారు.

# చరిత్రలో బీసీలు మరిచిపోలేనిరోజు

అమరావతి: 'చరిత్రలో ఈరోజు బీసీలు మరిచిపోలేని రోజు... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది... గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం అమలు కాబోతున్నాయి...' అని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత సంతోషం వ్యక్తంచేశారు.
స్థానిక స్వపరిపాలనలో వెనుకబడిన వర్గాలకు సాధికారత కల్పించడంపై శాసనసభలో లఘు చర్చ జరిగింది. మంత్రి సవిత ఈ చర్చను ప్రారంభించారు. బీసీలకు అవకాశం ఇవ్వడం, ప్రాతినిధ్యం కల్పించడం రాజకీయ సాధికారిత కల్పించడం తమ విధి అని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లకు ఈరోజు మంత్రి మండలిలో ఆమోదించామన్నారు. బీసీలకు ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకున్నందుకు సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్ కు ధన్యవాదాలు తెలియజేశారు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు జగన్ ప్రభుత్వం కోత పెట్టడం వల్ల 16 వేలకు పైగా పదవులకు బీసీలు దూరమయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనసభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల బిల్లు చర్చ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మాత్యులు ఎస్.సవిత మాట్లాడారు. బీసీల పక్షపాతి ప్రభుత్వం తమదని మరోసారి రుజువైందన్నారు. బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీని నిలబెట్టుకుంటున్నామన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పించాలని నిర్ణయించామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 33.33 శాతం మేర రిజర్వేషన్లు
అమలు చేయబోతున్నామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పనపై మంత్రిమండలిలో ఆమోదించా మన్నారు. అసెంబ్లీలో కూడా ఆమోదిస్తున్నా మన్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఆనాడు అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన ాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలకు మొట్టమొదటిసారిగా 1994లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. ఇప్పుడు మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్ల కల్పనతో బీసీలకు రాజ్యాధికారంలో అవకాశం కలుగుతుందన్నారు. తమను తాము పాలించుకునే అవకాశం కలుగుతుందని, చరిత్రలో నేడు మరిచిపోలేని రోజు అని మంత్రి సవిత ఆనందం వ్యక్తం చేశారు.

# పెట్టుబడిదారులకు స్వర్గధామం తెలంగాణ



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం అన్ని రకాల పెట్టుబడిదారులను ప్రోత్సహించే స్వర్గధామమని, క్లీన్ ఎనర్జీ రంగానికి నిలయంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్, నోవాటెల్ లో రెండు రోజుల పాటు జరగనున్న 'ఇండియా ఎనర్జీ సమ్మిట్ / ఎక్స్ పో 2026'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ కు విచ్చేసిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు మరియు సాంకేతిక నిపుణులను ఉద్దేశించి డిప్యూటీ సీఎం ప్రసంగించారు. పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు, శాస్త్రవేత్తలు, సీఈఓలు... మీ అందరినీ ఆహ్వానిస్తున్నాను, రండి. తెలంగాణ అన్ని రకాల పెట్టుబడి దారులను ప్రోత్సహించే రాష్ట్రం, ఇది పెట్టుబడిదారులకు ఒక స్వర్గధామం. మన సమృద్ధిని పంచుకోవ దానికి మరియు కలిసి ఎదగడానికి మిమ్మల్ని పూర్ణహృదయంతో ఆహ్వానించడానికి ఈ రాష్ట్రం సిద్ధంగా ఉంది' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇంధన రంగంలో మార్పు అనేది కేవలం విద్యుత్ ఉత్పత్తి మూలాన్ని మార్చడం మాత్రమే కాదని, అది సమగ్ర ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్నే మార్చే విప్లవాత్మక పక్రియ అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణను కేవలం స్వచ్ఛమైన ఇంధనాన్ని వినియోగించే రాష్ట్రంగా మాత్రమే కాకుండా, ప్రపంచ క్లీన్ ఎనర్జీ రంగానికి అవసరమైన సాంకేతికతలను తయారు చేసే ప్రధాన కేంద్రంగా నిలపాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుంటూనే, పర్యావరణ పరిరక్షణను సాధించేలా ప్రణాళికలు రూపొందించామని డిప్యూటీ సీఎం వివరించారు. ఇందులో భాగంగా 2030 నాటికి 20,000 మెగావాట్లు, 2035 నాటికి 26,000 మెగావాట్లకు పైగా సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. అలాగే పునరుత్పాదక ఇంధనానికి అత్యంత కీలకమైన 'విద్యుత్ నిల్వ' సామర్థ్యాన్ని కూడా భారీగా విస్తరిస్తున్నామని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా 2030 నాటికి 3,800 మెగావాట్లు, 2035 నాటికి 8,000 మెగావాట్ల నిల్వ వ్యవస్థను అందుబాటులోకి తెస్తామన్నారు. హైదరాబాద్‌లోని ఐటీ, ఎఐ నైపుణ్యాలను ఉపయోగించి భవిష్యత్తు విద్యుత్ గ్రిడ్‌ను డిజిటల్ నెట్‌వర్క్‌గా మారుస్తున్నామని ఆయన పేర్కొన్నారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో ఏర్పాటు చేయబోయే ఎఐ డేటా సెంటర్ కోసం ప్రత్యేకంగా 100 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్‌ను అనుసంధానిస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు 2030 నాటికి ఏటా 4 లక్షల టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, 2035 నాటికి 12,000 ఇ÷ఎ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సోలార్, విండ్, బ్యాటరీ ఉత్పత్తులను ఇక్కడే తయారు చేసే కంపెనీలకు మూలధన సాయం, ÷ూఉ÷ు రీయింబర్స్‌మెంట్, విద్యుత్ సుంకం మినహాయింపులతో పాటు ÷ుఉ-తిఖం÷ూ ద్వారా వేగవంతమైన అనుమతులు ఇస్తున్నామని వివరించారు. ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతోనే ఈ ఇంధన విప్లవం సాధ్యమవుతుందని, తెలంగాణతో కలిసి నడవాలని పారిశ్రామికవేత్తలకు డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను ఆయన సందర్శించారు.
డిప్యూటీ సీఎం వెంట స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్ తదితరులు ఉన్నారు.

# 2029లో మళ్లీ కాంగ్రెస్‌కే అధికారం ఖాయం



వచ్చాక పేదలకు ఇందిరమ్మ ఇళ్లు వస్తున్నాయని వివరించారు. దిశ బాగుంటుందని కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని తెలిపారు. కానీ కేసీఆర్ దిశ, దశ బాగా లేదు.. అందుకే తాను, భట్టి సచివాలయంలో ఉన్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. బీసీల లెక్కలు తేల్చిన తొలి ప్రభుత్వం మాదేనని అన్నారు. కేసీఆర్ చేసిన రూ.8 లక్షల కోట్ల అప్పు తెలంగాణ పాలిట ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. వడ్డీలు కట్టగా మిగిలిన డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని రేవంత్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్న గీత కార్మికులకు పెన్షన్లు అందించేలా ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. ఇరిగేషన్ కాల్వలపై ఈత, తాటి చెట్లను పెంచే చర్యలు చేపడతామని వెల్లడించారు. అలాగే గౌడ సామాజికవర్గం సహకారంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం ధీమా వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి పనిచేస్తున్నామని, తమ కాంబినేషన్‌లో 2029లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇందిరమ్మ పాలనలో తెలంగాణ బహుజనుల తెలంగాణగా మారుతుందని సీఎం అన్నారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. సర్వాయి పాపన్న ఆలోచనలకు అనుగుణంగా పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.
పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, సన్నబియ్యం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. గత పదేళ్ల పాలనపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. గత పాలకులు కులవృత్తులు చేసుకోవాలని చెప్పారని, తమ ప్రభుత్వం మాత్రం సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే.. మాది సోషల్ జస్టిస్' అని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 117 సీట్లు వస్తాయని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజలదేనని, మరోసారి పాత పాలనకు వెళ్లకుండా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం కుటుంబంలా పనిచేస్తోందని, ఏ సమస్య ఉన్నా చర్చించి పరిష్కరించుకునే విధానాన్ని అనుసరిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, కాంగ్రెస్ నాయకులతో పాటు బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కెబిఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలు

### ఏడాదిన్నరపాటు అమలు కానున్న ఆంక్షలు

### ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణం

### ట్రాఫిక్ సూచనలను పాటించాలన్న సజ్జన్నార్

హైదరాబాద్: హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ట్రాఫిక్ అమల్లోకి వచ్చింది. 18న అమల్లోకి వచ్చిన ఈ ప్రక్రియ నుంచి ఏడాదిన్నరపాటు కేబీఆర్ పార్క్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలు పాటించాల్సి ఉంటుంది. హెచ్ సిటీ ప్రాజెక్టులో భాగంగా కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన 7 ఫ్లై ఓవర్లు, 7 అండర్ పాస్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకే వన్ వే ట్రాఫిక్ అమలు చేస్తున్నట్టు సీపీ సజ్జనార్ స్పష్టం చేశారు. పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, రోడ్ నెం.45 మీదుగా ఐటీ కారిడార్‌కు వెళ్లే వాహనదారులు.. కేబీఆర్ పార్క్ జంక్షన్ నుంచి బసవతారకం, ఫిల్మ్ నగర్ మీదుగా రోడ్ నెం.45 చేరుకొని అక్కడి నుంచి ఐటీ కారిడార్‌కు చేరుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. హెచ్- సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.1300 కోట్ల వ్యయంతో కేబీఆర్ పార్కు చుట్టూ వీటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ సీపీ వీసీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ పార్కు చుట్టూ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పార్కు చుట్టూ వన్ వే చేశామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో చాలామంది ప్రజలు సంతోషిస్తున్నారని తెలిపారు. 'కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే కి సహకారం అందిస్తున్నందుకు అందరికి ధన్యవాదములు. అగ్రసేన్ చౌరస్తా రోడ్ నం 45, చెక్ పోస్ట్, వెంకటగిరి దగ్గర కాస్త ఇబ్బంది కలిగింది. డ్రోన్స్ ద్వారా
కంట్రోల్ రూమ్ నుండి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇంకా కొన్ని చోట్ల సూచికలు పెట్టాల్సి ఉంది. సాంకేతికతను ఉపయోగించి ఇంకా ఎటువంటి మార్పులు చేయాలో చూస్తాం. ముఖ్యంగా కొంత మంది సూచనలు పాటించకుండా వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు ఇచ్చే సూచనలు పాటిస్తూ వాహనదారులు ముందుకు వెళ్లాలని సూచిస్తున్నామని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

# బిఆర్ఎస్‌తో పోలిస్తే రెండింతలుగా భూ ఆక్రమణలు

### 22ఎ నిషేధిత జాబితా పేరుతో దోపిడీకి స్కెచ్

### రేవంత్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఎంపి ఈటెల రాజేందర్

హైదరాబాద్: గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన భూ అక్రమాల కంటే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ రెండింతలు పెరిగిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేసీఆర్, రేవంత్‌రెడ్డి ప్రభుత్వాల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం ప్రజలకు కేటాయించిన భూములు, పరిశ్రమల కోసం ఇచ్చిన స్థలాలు, చివరకు ప్రభుత్వమే లేఅవుట్లు వేసి విక్రయించిన భూములను సైతం 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమని ఈటల మండిపడ్డారు. దశాబ్దాలుగా రైతులు సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవడం వెనుక భూమాఫియాకు అప్పగించే కుట్ర ఉందని ఆరోపించారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేసినప్పటికీ భూములను లాక్కునే ప్రభుత్వాల విధానంలో ఎలాంటి మార్పు రాలేదని ఈటల విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం భూ దందాలకు పాల్పడితే.. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అదే భూములను సెటిల్‌మెంట్ చేసుకుంటోందని ఆరోపించారు. గతంలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఖర్చు చేసిన డబ్బులు ఇలాంటి భూ దందాల ద్వారా వచ్చినవేనంటూ ఈటల సంచలన ఆరోపణలు చేశారు. గల్ఫ్ ఆయిల్ కంపెనీకి చెందిన భూములు ఫీనిక్స్ కంపెనీ ద్వారా ఎలా చేతులు మారాయో అందరికీ తెలుసని ఈటల పేర్కొన్నారు. ఈ వ్యవహారాల్లో పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. పేదలు, రైతులకు అన్యాయం చేస్తూ రియల్ ఎస్టేట్ మాఫియాలకు కొమ్ముకాయడం మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. భూ అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం కొనసాగుతుందని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. అయితే, ఈ సమావేశంలో ఈటల చేసిన ఆరోపణలపై ప్రభుత్వం లేదా సంబంధిత వర్గాల స్పందన వెలువడాల్సి ఉంది.

# బిజెపి జేబుసంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్: 2014లో కొలువుదీరిన నాటి నుంచి రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందంటూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎన్నికల కమిషన్ కూడా బీజేపీకి అనుబంధ సంస్థగా మారిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సీబీఐ, ఈడీ తరహాలో ఎన్నికల సంఘాన్ని కూడా తనకు అనుకూలంగా మార్చుకుందని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.తెలంగాణలో ఎస్ఐఆర్‌కు ఇంకా సమయం ఇవ్వాలని ఈసీని డిమాండ్ చేశారు. అర్హులైన అందరికీ ఓటు హక్కు కల్పించాలని ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో తెలంగాణలో ఎన్నికల సంఘం నిర్దాక్షిణ్యంగా ఓట్లను తొలగించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన నేపథ్యంలో గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము ప్రతి ఓటు హక్కు కాపాడాలని చూస్తున్నామని అన్నారు. ఎన్నికల సంఘం గైడ్‌లైన్స్‌తో చాలా నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసీ ఉదాసీనంగా చూడటం కరెక్ట్ కాదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ 3.38 కోట్ల ఓట్లు ఉన్నాయని గుర్తు చేశారు. ఎఎస్‌బీడీల పేరుతో 22 శాతం ఓట్లు తొలగించారని చెప్పారు. ఓట్ల తొలగింపునకు ప్రధాని మోదీతోపాటు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు. పేద ప్రజల ఓట్లు తొలగిపోతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలను 35 వేల మందిని నియమించిందని తెలిపారు. కానీ ఈసీ మాత్రం13,100 మందిని ఇచ్చినట్లు చూపిస్తుందని చెప్పారు. సామాన్యుడి ఓటు తొలగించే ప్రయత్నం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా ఈసీపై నిప్పులు చెరిగారు. 2002లో ఓటు వేసి ఉండాలని కండిషన్‌తో చాలా మంది ఎనుమరేషన్ ఫామ్స్ ఇవ్వలేక పోయారని చెప్పుకొచ్చారు. దీంతో వారిని కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని వివరించారు. అన్ మ్యాపుడ్ ఓట్లు 32,37000 ఉన్నాయని అన్నారు. అలాగే 60,50,000 ఓట్లు సందేహంగా ఉన్నాయని చూపిస్తున్నారని పేర్కొన్నారు. దాంతో 92 లక్షల ఓట్లు ప్రశ్నార్థకంగా మారాయని ఆవేదనతో అన్నారు. 1.60 కోట్ల ఓట్లు ఎందుకు క్వశ్చన్ మార్క్ పెట్టారో చెప్పాలంటూ ఈసీని తెలంగాణ పీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. దేశంలో ఓటు హక్కును తొలగించే అధికారం మీకు ఎవరు ఇచ్చారంటూ ఈసీని ఆయన సూటిగా ప్రశ్నించారు. ప్రతి పౌరుడి ఓటు కాపాడాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని అన్నారు. హైదరాబాద్ నగరంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) అనేక ప్రాంతాల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లలేదని మహేశ్‌కుమార్ గౌడ్ ఆరోపించారు.
-

# పేదలకు భూమి పంపిణీ అత్యావశ్యకం



హైదరాబాద్: తాము అధికారంలోకి వస్తే 'భూలక్ష్మి' పేరుతో పేదలకు భూమి పంపిణీ చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. పేదల భూములను రేవంత్‌రెడ్డి లాక్కుంటే.. చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్.. టీఆర్ఎస్ కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. బీసీలకు పెద్దపీట వేస్తామని చెప్పినా.. ఆచరణలో మాత్రం సామాజిక న్యాయం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని భూమిలేని పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చేలా 'భూ లక్ష్మి పథకం' అమలు చేస్తామని ఆ పార్టీ అధినేత్రి కవిత ప్రకటించారు. రాష్ట్రంలో భూమి పంపిణీ అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భూమి కేవలం లావాదేవీల అంశంగా కనిపించవచ్చని, అయితే పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు భూమి, అడవి జీవనాధారమని కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ ప్రాజెక్టు చేపట్టినా ముందుగా అసైన్డ్ భూములనే తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 వేల ఎకరాల అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పేదలకు అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి సోదరులపై కూడా కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వారి ఆధ్వర్యంలో భూ దోపిడీ జరుగుతోందని ఆరోపిస్తూ.. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలనను తీవ్రంగా విమర్శించారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క కుటుంబ సభ్యుల ప్రభావం ప్రభుత్వంలో కొనసాగుతోందని ఆమె ఆరోపించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి.. గత 31 నెలల్లో ఆ అంశాన్ని ఎందుకు పట్టించుకోలేదని కవిత ప్రశ్నించారు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే ముందు కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ సలహాదారుల నియామకాల్లోనూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. ఒకే రోజు శివధర్‌రెడ్డి, వీహెచ్‌లను సలహాదారులుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఇద్దరి వేతనాల్లో తేడా ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఆర్టీఐ కమిషన్‌లో ఒక్క బీసీకి కూడా అవకాశం కల్పించలేదని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నియామకాల్లో సామాజిక న్యాయం పాటించడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో అగ్రవర్ణాలకు ఒక న్యాయం, పేదలకు మరో న్యాయం కొనసాగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత సూచించారు.విజయశాంతి లాంటి ఉద్యమకారులను పక్కన పెట్టి.. మంత్రి పదవి ఇవ్వకుండా ఎమ్మెల్సీ పదవితో సరిపెట్టారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి చెప్పేది సామాజిక న్యాయం.. కానీ ఆచరణలో మాత్రం అటవికా న్యాయమని విమర్శించారు. అప్పర్ క్లాస్ మాట్లాడితే ఒక రకమైన చర్యలు.. లో క్లాస్ మాట్లాడితే మరో రకమైన చర్యలు తీసుకుంటారా ఇదేనా రేవంత్‌రెడ్డి సామాజిక న్యాయం? అని ప్రశ్నల వర్షం కురిపించారు. తెలంగాణలో రేవంత్ రాక్షస పాలన సాగుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డికి భూమి అంటే కమర్షియల్ ట్రాన్సాక్షన్‌గా మారిపోయిందని
ధ్వజమెత్తారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో కూడా మూడు వేల ఎకరాల భూమిని పేదలకు ఇచ్చిందని.. ఆ తర్వాత ఆపేసిందని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న, అన్యాక్రాంతమైన భూములను సేకరించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి ఇవ్వడం సాధ్యమేనని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి - పదేపదే గతంలో జరిగిన విషయాలనే ప్రస్తావిస్తూ.. చేయాల్సిన పనులను పక్కన పెట్టకూడదని కవిత పేర్కొన్నారు.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక
గుంటూరు
బుధవారం, 19 ఆగష్టు 2026
వార్తలు

# 'నవ గుంటూరు' లో భాగంగా నగరంలో పచ్చదనం పెంపు

### వివిధ ప్రదేశాలను తనిఖీ చేసిన జీఎంసీ కమిషనర్

**గుంటూరు, 18 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** 'నవ గుంటూరు' లో భాగంగా నగరంలో పచ్చదనం పెంపు కోసం రోడ్ల వెంబడి, పార్క్ ల్లో నిర్దేశిత లక్ష్యానికి తగిన విధంగా మొక్కలను విరివిగా నాటడం, వాటిని సంరక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్, హార్టికల్చరల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉద్యోగ నగర్, జెకెసి కాలేజీ రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, మల్లికార్జునపురం, బాలాజీ నగర్, చిన్నేరు కుంట, హెడ్ వాటర్ వర్క్స్ ని పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, 'నవ గుంటూరు'లో భాగంగా నగరంలో పచ్చదనం పెంపే లక్ష్యంగా మొక్కలు నాటడం జరుగుతుందని, ప్రధానంగా రోడ్లకి ఇరువైపులా, డివైడర్లతో పాటు నూతన రోడ్ల నిర్మాణ ప్రతిపాదనల్లో మొక్కలు కూడా ఉండేలా చూడాలని ఎస్ఈని ఆదేశించారు. ఇన్నర్ రింగ్ రోడ్ రెడ్డిపాలెంలోని పార్క్ ని పరిశీలించి, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, పార్క్ లో గ్రీనరీ లాన్, మొక్కలు నాటాలని ఏడీహెచ్, డిఈఈని ఆదేశించి, పార్క్ నిర్వహణకు వాకర్స్ కమిటీ ముందుకు రావాలని కోరారు. రోడ్లకు ఇరువైపులా నాటే మొక్కలకు సపోర్ట్ గా కర్రలను కట్టాలని,



ఎప్పటికప్పుడు నీటిని అందించాలని ఏడీహెచ్ ని ఆదేశించారు. చిన్నేరుకుంటని పరిశీలించి, వాకింగ్ ట్రాక్, కాంపౌండ్ వాల్ నిర్మాణంకు చర్యలు తీసుకోవాలన్నారు. హెడ్‌వాటర్ వర్క్స్‌ని పరిశీలించి, గుంటూరు నగరానికి ఉండవల్లి దగ్గర ప్రకాశం బ్యారేజి నుండి పైప్ లైన్ ద్వారా నేరుగా నీటిని పంపింగ్ చేసి, తక్కెళ్లపాడు ట్రీట్మెంట్ ప్లాంట్ లో ఫిల్టర్ చేసి, క్లోరింగ్, ఆలం తగు మోతాదులో కలిపి సరఫరా చేస్తామని, గుంటూరు చానల్ నుండి నీటిని తీసుకోవడంలేదన్నారు. హెడ్ వాటర్ వర్క్స్ లో ఎప్పటికప్పుడు నీటి నాణ్యతను తనిఖీ చేసి, నిర్దేశిత రిజిస్టర్ లో నమోదు చేయాలని,



ప్లాంట్ పరిసరాల్లోకి ఇతరులు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అనంతరం ఇటీవల బృందావన్ గార్డెన్స్ రోడ్ విస్తరణలో ప్రభావితమయ్యే చెట్లను ట్రాన్స్ లొకేషన్ లో భాగంగా హెడ్ వాటర్ వర్క్స్ ప్లాంట్ పరిసరాల్లో నాటిన చెట్లను పరిశీలించి, వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏడిహెచ్ ని ఆదేశించారు. ఈ పర్యటనలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ శ్రీనివాస్, వెంకటరమణ, ఏడీహెచ్ శాంతి, ఏసిపీ జకిరా, ఎస్ఎస్ లు సోమశేఖర్, అయూబ్ ఖాన్, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పై జిఎంసి కఠిన చర్యలు అభినందనీయం

### ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, 18 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేందుకు గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంసీ) చేపడుతున్న చర్యలు అభినందనీయమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం నేడు పర్యావరణానికే కాకుండా మానవాళికి, పశుపక్ష్యాదులకు తీవ్ర ముప్పుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఒక సెల్ఫీ వీడియో ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, అనేక జీవరాశులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సమస్యను నివారించేందుకు ప్రభుత్వం, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో ఎన్నోసార్లు కోరినట్లు తెలిపారు. ఆ దిశగా జీఎంసీ అధికారులు ముందడుగు వేయడం సంతోషకరమన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయదారులకు, వినియోగదారులకు ఇప్పటికే నెల రోజుల క్రితమే నోటీసులు జారీ చేసి అవగాహన కల్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిర్దేశిత ప్రమాణాలకు లోబడని ప్లాస్టిక్ ఉత్ప



త్తులను పూర్తిగా నిషేధించాలని సూచించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, అందుకే జీఎంసీ అధికారులు నిబంధనలను ఉల్లంఘించిన వారి వద్ద నుంచి పెద్ద ఎత్తున ప్లాస్టిక్‌ను స్వాదీనం చేసుకుంటున్నారని చెప్పారు. అయితే కేవలం వ్యాపారులను నియంత్రించడం మాత్రమే సరిపోదని, ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో ప్లాస్టిక్ వ్యర్థాల కోసం ప్రత్యేక డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవాలని, నీటి సీసాలు, చిప్స్ ప్యాకెట్లు, ఇతర ప్లాస్టిక్ వస్తువులను వేరు చేసి నిల్వ చేయాలని సూచించారు. వారానికి ఒకసారి వాటిని పారిశుధ్య సిబ్బందికి అప్పగించేలా అలవాటు చేసుకోవాలని కోరారు. జీఎంసీ ఆధ్వర్యంలో ఇంటింటి చెత్త సేకరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర చెత్తతో కలిపి ఇస్తే వాటిని తిరస్కరించే విధానాన్ని అమలు చేయాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందువల్ల ప్రతి కుటుంబం ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ప్రపంచంలోని అత్యంత పరిశుభ్రమైన నగరాలు, అభివృద్ధి చెందిన దేశాలు పరిశుభ్రతలో ముందుండటానికి ప్రభుత్వాల కఠిన చర్యలతో పాటు ప్రజల సహకారమే ప్రధాన కారణమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన, భాగస్వామ్యం, సహకారం పెరిగితేనే ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమవుతుందని అన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నియంత్రణ కోసం గత కొన్ని నెలలుగా నిరంతర కృషి చేస్తున్న జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్, జిల్లా కలెక్టర్ సిఎం సాయి కాంత్ వర్మతో పాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అవగాహన కార్యక్రమాలతో పాటు క్షేత్ర స్థాయిలో కఠిన చర్యలు అమలు చేస్తూ ప్లాస్టిక్ నియంత్రణకు కార్యాచరణ చేపట్టినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జూనియర్ డాక్టర్ల ఆందోళనలు ఉధృతం



**గుంటూరు, 18 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సమస్యల పరిష్కారం కోరుతూ జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళన రోజురోజుకీ ఉధృతం అవుతోంది. ఇప్పటికే ఎమర్జెన్సీ విధులను బహిష్కరించిన జూనియర్ డాక్టర్లు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం గుంటూరులో భారీ ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్ పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణాతో సమానంగా స్టైఫండ్ ఇవ్వడం సాధ్యం కాదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ప్రకటన చేయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ జీవన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని స్టైఫండ్ పెంచాలని కోరారు. పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

# పనుల నాణ్యతలో రాజీ లేదు : జిల్లా కలెక్టర్



**గుంటూరు, 18 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వసతి, విద్యా సంస్థల నవీకరణ (మార్పు) పనుల నాణ్యతలో రాజీ లేదని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 'మార్పు' కార్యక్రమంపై కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భం గా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 36 వసతి, విద్యా సంస్థలలో 'మార్పు' కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని వివరించారు. ప్రస్తుతం ఎంపిక చేసిన సంస్థలలో సుందరీకరణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పడమే కాకుండా కనీస వసతులు పక్కాగా ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. పది మందికి ఒక మరుగు దొడ్డి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీరు పరిరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) నిర్మాణాలు, సౌర విద్యుత్ కల్పన, వ్యర్థాల నివారణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.ఎల్. హర్షిత, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి కె.మయూరి, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి డి.దుర్గాబాయి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్థ సారథి, ఎపిఇడబ్ల్యూఐడిసి కార్యనిర్వహణ ఇంజనీర్ అనిల్ కుమార్, రహదారులు, భవనాలు శాఖ ఇంజనీర్లు, నెడ్ క్యాప్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై బాధ్యతగా ఉండాలి : ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, 18 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** రోడ్డు భద్రత పై అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనదారులు పాటించాల్సిన నియమాల గురించి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అసెంబ్లీ సాక్షిగా ప్రజల్లో చైతన్యం కలిగించేలా ప్రసంగించారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్ లో వాహనాలపై రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ అంశంపై సభ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు పై జరిగే ఒక ప్రమాదం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుందని, దీనిపై ఎప్పటికప్పుడు చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలియజేశారు. 2023లో 19497 రోడ్డు ప్రమాదాలలో 8147 మంది మరణించారని తెలిపారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్డు భద్రత ప్రమాణాలను పాటిస్తున్నామని, అయితే ప్రమాదాల సంఖ్య తగ్గినప్పటికీ మరణాల సంఖ్య పదిహేను శాతం పెరిగిందని చెప్పారు. ఇది దేశంలోని సగటు కంటే ఎక్కువని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల నిర్మాణం చేపడుతూనే భద్రత చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలో రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడం వల్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై ప్రజల్లో చైతన్యం రావాలని చెప్పారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేని వాహ



నాలకు లైసెన్స్ రద్దు చేస్తున్నారని ఇది ప్రతినిత్యం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ వాహనాల నుంచి ఊడిపోతే తర్వాత వాటి గురించి పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రహదారుల నుంచి చిన్న పల్లెటూర్లకు వెళ్లే రోడ్ల వరకు ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై రాష్ట్ర ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా పని చేస్తోందని తెలిపారు. హైవేలపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో 79 శాతం రిఫ్లెక్టివ్ స్టిక్కర్స్ లేకపోవడమే కారణమన్నారు. దీనిపై పటిష్టమైన చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాల నివారణపై చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు.

**బీసీల పక్షపాతి సీఎం చంద్రబాబు నాయుడు**

బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని, బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని గుంటూరుతూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. బీసీలకు తెలుగుదేశం పార్టీ మొదట నుంచి వెన్నెముకగా నిలుస్తోందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ద్వారా మరోసారి బీసీలపై తమ చిత్తశుద్ధిని కూటమి ప్రభుత్వం నిరూపించుకుందని చెప్పారు. మున్సిపాలిటీల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయమని తెలిపారు. బీసీలను ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో ఎదిగేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత జగన్ హయాంలో బీసీలు అన్ని రకాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైసీపీ నిర్వాకం వల్ల బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరిగిందని మండిపడ్డారు.



# టర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) విచారణ ప్రక్రియ పక్కాగా జరగాలి

### కమిషనర్ మయూర్ అశోక్

**గుంటూరు, 18 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం పారదర్శకంగా, నిర్దేశిత నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరగాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. మంగళవారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 139, 176 పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న సర్ విచారణ ప్రక్రియను పరిశీలించి, విచారణకు సంబంధించిన రికార్డులను, ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విచారణకు హాజరయ్యే ప్రజలు మరియు దరఖాస్తుదారులు తమతో పాటు నిర్దేశిత గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా తీసుకువచ్చేలా బిఎల్ఓలు పూర్తి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. విచారణకు అత్యవసర కారణాలతో హాజరు కాలేని వారికి పరిశీలించి, మరో మారు విచారణ సమయం కేటాయించాలని ఏఈఆర్ఓలను ఆదేశించారు. ఎలాంటి లోపాలు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా విచారణ ప్రక్రియను వేగవంతంగా మరియు నిష్పక్షపాతంగా నిర్వహించాలని సూచించారు. కేంద్రాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, వారికి అవసరమైన సమాచారాన్ని అందిస్తూ బిఎల్ఓలు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఏఈఆర్ఓ జి.సాంబశివరావు, సూపర్వైజరీ అధికారి రవి కిరణ్ రెడ్డి, బిఎల్ఓలు పాల్గొన్నారు.

# ఏఎన్యూ అంతర్జాతీయ అవార్డుకు ఎంపిక



**గుంటూరు, 18 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ ప్రతిష్ఠాత్మక 'మాస్టర్' అవార్డుకు ఎంపికైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫోటోగ్రఫీ విభాగం అతిథి అధ్యాపకుడు శ్రీనివాసరెడ్డిని వీసీ గంగాధర్ రావు అభినందించారు. 39 ఏళ్లుగా ఫోటో జర్న లిస్టుగా సేవలందిస్తూ అనేక డాక్యుమెంటరీలు రూపొందించిన ఆయన కృషిని గుర్తించి ఈ అంతర్జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. కొత్తతరానికి ఫోటోగ్రఫీలో శిక్షణ అందిస్తూ ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

# కార్మికవర్గ సమస్యలు ప్రభుత్వాలకు పట్టవా?



### గుంటూరు ధర్నాలో రావులపల్లి రవీంద్రనాథ్

**గుంటూరు, 18 ఆగస్ట్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** సంపద సృష్టికర్తలైన కార్మికవర్గ సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేకపోవడం శోచనీయమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలనే నినాదంతో ఏఐటీయూసీ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో వివిధ అనుబంధ సంఘాలతో కలిసి కలెక్టరేట్ వద్ద మంగళవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షులు చల్లా చినఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ సుదీర్ఘకాలం కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడ్డారు. యాజమాన్యాల దయాదాక్షిణ్యా లపై ఆధారపడేలా 4 లేబర్ కోడ్లు తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కోడ్ల అమలుతో సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును కార్మికవర్గం కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పని ప్రదేశాలలో మెరుగైన వసతులు ఉండవని, పనిభద్రత, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు జరుగవని అన్నారు. ఎనిమిది గంటల పనిదినాలను 12 గంటలకు పెంచడటం జరిగిందని గుర్తుచేశారు. తక్షణమే ఈ 4 లేబర్ కోడ్లను ఉపసంహరించుకుని 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలైన కార్మికుల సమస్యల పరిష్కారానికి కనీసం ఐదు నిముషాలు కేటాయించకపోవడం దురదృష్టకరమని అన్నారు. గత 12 సంవత్సరాలుగా 73 షెడ్యూల్స్లోని 50 లక్షల మంది కార్మికుల వేతన సవరణ జరుగలేదని, ఇటీవల కార్మిక శాఖ మంత్రి కూడా వేతన సవరణ త్వరితగతిన చేపట్టాలని ఆదేశించినప్పటికీ నేటికి ప్రారంభం కాకపోవడం విచారకరమని అన్నారు. అన్ని కార్మిక సంఘాలను సమైఖ్యపరచి భవిష్యత్తులో తీవ్ర పోరాటానికి సమాయత్తం అవుతామని హెచ్చరించారు.

## జూనియర్ వైద్యులు సమస్య పరిష్కరించాలని

# రిలే దీక్షలు

### జిజిహెచ్ లో అత్యవసర సేవలుతో పాటు అన్ని విభాగాలు బహిష్కరించి నిరసన



**కాకినాడ బ్యూరో, 18 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** తమ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ జూనియర్ వైద్యులు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. నిరసన లు మంగళవారం కి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. కాకినాడ రాజా రామ్మోహన్ రాయ్ రోడ్డు లో జిజిహెచ్ ఎదుట మహిళా జూనియర్ వైద్యుల వసతి గృహం వద్ద నిర్వహించిన దీక్షలకు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా రాష్ట్ర జూనియర్ వైద్యులు సంఘం ఉపాధ్యక్షులు కె. రమేశ్ మాట్లాడుతూ గత ఎనిమిది రోజులుగా శాంతి యుత వాతావరణంలో అనేక రూపాలు లో నిరసన తెలిపామనిఅన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మొత్తం 900 మంది జూనియర్ వైద్యులు నిరసనలు లో పాల్గొంటున్నారని చెప్పారు. రిలే దీక్షలు లో మహిళా జూనియర్ వైద్యులు పాల్గొన్నారని అన్నారు. దీక్షలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేతలు, వైద్య రంగానికి చెందిన వివిధ సంఘాలు నేతలు మద్దతు ప్రకటించారని తెలిపారు. స్టైఫండ్ 15 శాతం పెంచాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎం సీ జూనియర్ వైద్యులు సంఘం ప్రధాన కార్యదర్శి తనూజ, రంగరాయ వైద్య కళాశాల జూనియర్ వైద్యులు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు అశ్విన్ కుమార్, ఆర్ దాసు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు

### చరిత్రలో బీసీలు మరిచిపోలేని రోజు : టీడీపీ రాష్ట్ర బీసీ నాయకుడు చేజర్ల సతీష్



**బాపట్ల, 18 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రలో బీసీలు మరిచిపోలేని రోజుగా నిలిచిపోతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ నాయకుడు చేజర్ల సతీష్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీసీలకు 34 శాతం, పట్టణ ప్రాంతాల్లో 331/2 శాతం రిజర్వేషన్లు అమలు కానుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీల్లో మరో ముఖ్యమైన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మకు చేజర్ల సతీష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు కోత విధించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా 16 వేలకు పైగా రాజకీయ పదవులకు బీసీలు దూరమయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం లభించే అవకాశం ఏర్పడిందన్నారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మంగళవారం శాసనసభలో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై చర్చ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కట్టుబడి పనిచేస్తున్నారని, ఆయన బీసీల పక్షపాతి అని మరోసారి రుజువైందని చేజర్ల సతీష్ అన్నారు. బీసీలకు న్యాయం జరిగేలా కీలక నిర్ణయం తీసుకున్న కూటమి ప్రభుత్వానికి బీసీ వర్గాల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు.

# పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలి

### కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పేనాయక్



**కాకినాడ బ్యూరో, 18 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** జిల్లాలో గత జూలై 31ను ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితా పై ప్రజలకు అవగాహన కల్పించి, అత్యంత ఖచ్చితత్వంతో కూడిన ఓటర్ల జాబితా రూపకల్పన చేసేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి.తిప్పే నాయక్ కోరారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిని వివరించారు. ఈ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రజలు తమ సహకారం అందించాలని డీఆర్ఓ కోరారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధి లో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా గత జూలై 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితాను ప్రచురించడం జరిగిందన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు డ్రాఫ్ట్ జాబితా పై అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందన్నారు. కాకినాడ జిల్లాలో వివిధ కారణాలతో మొత్తం 1,95,602 ఓట్లను తొలగించడం జరిగిందని, వీటిలో 31,695 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజల్లో అవగాహన, చైతన్యాన్ని కల్పించి, క్లెయిమ్స్, అభ్యంతరాల నమోదుకు సహకరించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం-6, ఓటరుజాబితాలో మార్పులు, చేర్పుల కోసం ఫారం-7, పోలింగ్ కేంద్రం మార్పు కోసం ఫారం-8 ద్వారా అందిన దరఖాస్తులు, నోటీసుల ను నిబంధనల మేరకుఅత్యంతపారదర్శకం గా పరిశీలించడం జరుగుతుందన్నారు. ఓటర్ల జాబితా సవరణలో నాణ్యత కు ప్రాధాన్యత నిస్తూ,ఏఈఆర్ఓలు రోజుకు గరిష్టంగా 100 నోటీసులను మాత్రమే పరిశీలించాలని సూచించామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, అనర్హులైన వారి పేర్లు జాబితాలో లేకుండా అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిర్వహించేందుకురాజకీయ పార్టీలు..ఎన్నికల యంత్రాంగం సమన్వయం తో పనిచేయాలని డీఆర్వో కోరారు. ఓటర్లు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని సంబంధిత అధికారులకు ఆగస్టు 30 నాటికి దాఖలు చేయాలన్నారు. అర్హత కలిగి, నోటీసులు అందుకున్న ఓటర్లు గుర్తింపు పత్రాలతో పాటు సంబంధిత అధికారుల ముందు హాజరై అర్హతను ధ్రువీకరించు కోవచ్చునన్నారు. ఈ సమావేశంలో ఎన్.గౌతమ్ (ఆప్) ఎస్.అప్పారావు (బీఎస్పీ), పి.వీరబాబు (సీపీఐ-ఎం) కె. విజయ రామయ్య(భాజపా), పి.శ్రీనివాస రావు(ఐఎన్సీ), జి.సాయి బాబు (తెదేపా), ఆర్.వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ),ఏ.వీవీ. సత్య నారాయణ (జేఎస్పీ), ఎన్నికల విభాగం సూప రింటెండెంట్ ఎం.జగన్నాథం,డీటీ తేజ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి పండుగ సందర్భంగా పగడ్బందీ ఏర్పాట్లు కు చర్యలు

### జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్



**కాకినాడ బ్యూరో, 18 ఆగస్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల నిమజ్జనం కు జిల్లా లో పగడ్బందీ ఏర్పాట్లు కు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేశీధిర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళ వారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరం లో గణపతి నవరాత్రులు, నిమజ్జనం ఏర్పాట్లు పై సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కు మట్టి గణపతి ని పూజిద్దాం అని విగ్రహాల తయారీలో రసాయన రంగులకు బదులుగా సాధ్యమైనంత వరకు సహజ రంగులను ఉపయోగించేలా చూడాలని తెలిపారు. పర్యావరణానికి హాని కలగకుండా ఈ ఉత్సవాలను శాంతి యుత వాతావరణం లో నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో సమావేశ నిర్వహణతో పాటు డివిజన్,మండల స్థాయి లో కూడా ఉత్సవ కమిటీ లతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై గణేశ మందిరాలు లేదా పెద్ద మండపాలను ఏర్పాటు చేసేటప్పుడు సంబంధిత శాఖల (రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థలు, విద్యుత్, అగ్నిమాపక శాఖలు) నుండి తప్పనిసరిగా అనుమతి పొందాలని నవరాత్రి ఉత్సవాల సమయంలో మండపాల వద్ద ఉత్సవ కమిటీలు అగ్ని ప్రమాద నివారణ పరికరాలను (ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరాలు మొదలైనవి) అందు బాటులో ఉండాలని తెలిపారు. ఈ పండుగల సందర్భంగా బాణా సంచా చేయరాదని నిమజ్జన సమయంలో ఇతర పూజా సామాగ్రి, ఆధార సంబంధిత పరికరాలను కాల్చడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడే అవకాశం ఉన్నందున అటువంటి చర్యలను నివారించాలని తెలిపారు. నిమజ్జనం రోజులలో ఊరేగింపుల కోసం సంబంధిత పోలీస్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని ఏఏ రోడ్ల నుండి ఊరేగింపు జరుగుతుందో ముందుగా తెలియజేయాలని ఒకేసారి అనేక విగ్రహాలు నిమజ్జనానికి రాకుండా స్లాట్ పద్ధతిలో నిమజ్జనం నిర్వహించే విధంగా చూడాలన్నారు. రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ, అగ్నిమాపక, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి గ్రామీణ ప్రాంతా లతో సహా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేశ విగ్రహాల నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను గుర్తించి రెండు రోజుల్లోగా నిర్దిష్ట సిఫార్సుల తో కూడిన గణేశ విగ్రహాల నిమజ్జన ప్రదేశాల జాబితాను సమర్పించాలని తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన ప్రాంతం లో రాత్రి 10గంటల తర్వాత మైక్ సెట్ల వాడకాన్ని నిలిపి వేయాలని, పంచాయితీ పరిధి లో డిపిఓ గ్రామ స్థాయిలో పంచా యితీ అధికారి అర్బన్ పరిధి లో మున్సిపల్ కమిషనర్లు నిమజ్జన ప్రదేశాలలో క్రేన్లను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రదేశాలలో తగినంత విద్యుత్ దీపాల (లైటింగ్) ఏర్పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ ఏర్పాటు తో పాటు మత్సశాఖ వారిచే పడవలు, ఈతగాళ్ల ను అందు బాటులో ఉంచాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాలన్నిం టిలోనూ వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ ను, మండపాల వద్ద అగ్ని ప్రమాద నివారణ పరి కరాలను ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంత రాయం కలగకుండా చూడటం అవసరమైన చర్యలు తీసుకోవడం ప్రతిరోజు పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని షిఫ్టుల వారీగా పనిచేసేలా సిబ్బందిని నియమిం చాలన్నారు. జిల్లా లో గణపతి నవరాత్రులు, గ్రహాల నిమజ్జను కార్యక్రమాన్ని శాంతియుత వాతావరణం లో నిర్వహించేందుకు సం బంధిత అధికారులు సమన్వయం తో పని చేయాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు గతంలో నిమజ్జన సమయంలో జరిగిన అంశాలను అందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశం లో డిఆర్ఓ డాక్టర్ తిప్పే నాయక్, ఇతర సంబంధిత శాఖల అధికారులు ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# సాగునీరు అందించలేకపోతే రైతులకు ఎకరాకు 20 వేలు ఆర్థిక సహాయం ప్రకటించాలి

### జగ్గంపేట నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర



**కాకినాడ బ్యూరో (జగ్గంపేట), 18 ఆగష్టు 2026, భారత ప్రతినిధి న్యూస్** : పుష్కర ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణానికి సుమారు 52 కోట్లతో పాతసిమెంట్ పైప్‌లైన్ స్థానంలో ఎంఎస్ పైప్‌లైన్ ఏర్పాటు, పంప్‌హౌస్, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులు చేపట్టారు. ఈ పనులు వాస్తవానికి వేసవికాలంలో పూర్తిచేసి, ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు నీరు అందించాల్సి ఉంది. అయితే వేసవిలో పూర్తి చేయాల్సిన పనులను వర్షాకాలంలో చేపట్టడం,పనుల్లో వేగం లేకపోవడం వల్ల నేడు వేలాది ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందని సూర్యచంద్ర తెలిపారు. 2025 సెప్టెంబర్ 10న అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్, డిసెంబర్ 10 నాటికి టెక్నికల్ శాంక్షన్, టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు, 2026 ఫిబ్రవరి 6 నుంచి పనులు ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేసే విధంగా సంబంధిత కాంట్రాక్టర్ మెగా కంపెనీ వారికి వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. అయితే పనులు ప్రారంభించిన తరువాత కూడా వేగంగా పూర్తి చేయడానికి అవసరమైన యంత్రాలు, సిబ్బందిని సమృద్ధిగా వినియోగించలేదని ఆయన విమర్శించారు. మే 7వ తేదీన తాము పుష్కర పనులను స్వయంగా పరిశీలించినప్పుడు, మూడు నెలల్లో కేవలం సుమారు 10 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన సమయంలో 90 శాతం పనులు పూర్తి చేయడం కష్టమని ముందుగానే అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి మీడియా ద్వారా తీసుకెళ్లామని సూర్యచంద్ర తెలిపారు. ఆ సమయంలో కేవలం రెండు ప్రొక్లెయినర్లు మాత్రమే పనిచేస్తున్నాయని, కనీసం 20 ప్రొక్లెయినర్లు, హైడ్రాలు తదితర యంత్రాలను వినియోగించి యుద్ధప్రాతిపదికన పాత పైపులు తొలగించి కొత్త పైపులు ఏర్పాటు చేయాలని కోరామని ఆయన చెప్పారు. అప్పుడే పనులను వేగవంతం చేసి ఉంటే నేడు రైతులకు ఈ దుస్థితి వచ్చేది కాదని అన్నారు. మే 13న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుష్కర పథకాన్ని పరిశీలించి,మే 19న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన చేస్తామని ప్రకటించారని సూర్యచంద్ర తెలిపారు. లోకేష్ పర్యటన రద్దు కావడంతో మే 19న ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి, జూలై 20 నాటికి తప్పనిసరిగా రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. జూలై 20న పనులను పరిశీలించిన తరువాత కూడా పనులు ఆలస్యంగా ప్రారంభమైనందున పూర్తి కాలేదని, ఆగస్టు 15 నాటికి తప్పనిసరిగా నీరుఅందిస్తామని మరోసారి హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే హామీని నమ్మిన రైతులు నారుమడులు వేసుకున్నారని,ఎండలు తీవ్రంగా ఉన్నప్పటికీ బిందెలతో నీరు పోసి నారుమడులను కాపాడుకునే ప్రయత్నం చేశారని, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం మొదటి పైప్ లైన్ పూర్తి కావడానికి మరో 15 నుంచి 20 రోజుల సమయం పడు తుందని, రెండవ పైప్ లైన్ రెండు నుండి మూడు నెలలు కాలం పట్టే పరిస్థితి ఉందని సూర్యచంద్ర తెలిపారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, పంప్‌హౌస్ పనులు కూడా పూర్తిస్థాయిలో పూర్తికాలేదని ఆయన పేర్కొన్నారు. రెండు పైప్‌లైన్లు పూర్తయి, మొత్తం ఐదు మోటార్లను నడిపితే సుమారు 8 క్యూమెక్స్ అంటే సెకనుకు 8,000 లీటర్ల నీరు విడుదలవుతుందని సూర్యచంద్ర తెలిపారు. మొదటి పైప్‌లైన్‌లో రెండు మోటార్లతో సుమారు 3.20 క్యూమెక్స్ అంటే సెకనుకు 3,200 లీటర్ల నీరు మాత్రమే అందే అవకాశం ఉంటే, రెండవ పైప్‌లైన్ పూర్తికాకుండా మొత్తం 32,000 ఎకరాల ఆయ కట్టుకు అవసరమైన స్థాయిలో సాగునీరు ఎలా అందిస్తారో అధికారులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ రైతులకు స్పష్టం గా వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను నమ్మించి నారుమడులు వేయించారు గత ఆరునెలలుగా ఈసంవ త్సరం పుష్కర ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని, ఇప్పుడు పుష్కర పనులు పూర్తి కాకపోవడంతో వేలాది ఎకరాలకు నాట్లు వేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించాలి ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి చెరువుల్లో కూడా తగినంత నీరు లేకపోవడం, మరోవైపు పుష్కరఎత్తిపోతల పథకం పనులు పూర్తికాకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని సూర్యచంద్ర తెలిపారు. మొదటి పైప్‌లైన్ ద్వారా పరిమితంగా నీరు అందించినా, రెండవ పైప్‌లైన్ పూర్తికావడానికి మరింత సమయం పట్టే పరి స్థితిలో వేలాది ఎకరాల్లో రైతులు నాట్లు వేయలేని పరిస్థితి ఏర్ప డుతుందని అన్నారు. ఈ సంవత్సరం పుష్కర సాగునీరు అందక నష్టపోయే ప్రతి ఎకరాకు రైతుకు రూ.20,000 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించాలన్నారు ఈ అంశాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే శ్రీ జ్యోతుల నెహ్రూ అసెంబ్లీ సమావేశాలు ఆగస్టు 20వ తేదీతో ముగిసేలోపు జగ్గంపేట నియోజకవర్గ పుష్కర ఆయకట్టు రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాగునీరు అందని ప్రతి ఎకరాకు రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించేలా ముఖ్యమంత్రి కోరాలని ఎమ్మెల్యే పాటంశెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేశారు.

## వర్షాభావ పరిస్థితుల్లో వరి పంట నిర్వహణపై రైతులకు అవగాహన కార్యక్రమం




### పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఫారుఖ్

**చెరుకుపల్లి, 18 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చెరుకుపల్లి మండల పరిధిలోని కావూరు, అరుంబాక గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ అధికారి Md. ఫారుఖ్ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వెదపద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను అధికారులు పరిశీలించి రైతు లకు పలు సూచనలు చేశారు. రైతులు సకా లంలో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, పిలకల దశ వరకు ఆరు తడి పద్ధతిలో నీటిని పొదుపు గా వాడుతూ పొలం గట్లను పటిష్టంగా ఉంచాలని సూచించారు. బెట్ట పరిస్థితులను తట్టుకు నేందుకు 13:0:45 (పొటాషియం నైట్రేట్) పోషకాలను పిచికారీ చేయాలని తెలి పారు. అలాగే ఆగస్టు 31 వరకు పొడిగించిన PM FB పంటల బీమా, వ-పంట నమోదును రైతులు వెంటనే RSK సిబ్బంది ద్వారా పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో PA CS కావూరు చైర్మన్ వీ. తాతాజీ, APCNF సిబ్బంది, AEO రామకృష్ణ, VAA\T S. రజని తదితరులు పాల్గొన్నారు.


## అసెంబ్లీలోనే కార్మికుల సమస్యలు చర్చించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి




### ఏఐటీయూసీ డిమాండ్

**రేపల్లె, 18 ఆగష్టు 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పై ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా తదితర కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పి. నాగాంజనేయులు మాట్లాడుతూ.. ప్రజాప్రతి నిధుల జీతాలు పెంచుకోవ డంలో చూపే శ్రద్ధ కార్మికుల కష్టాలపై పాలకులు చూపకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో 73 రకాల షెడ్యూల్ పరిశ్రమల్లో 15 ఏళ్లుగా వేతనాల సవరణ జరగలేదని, నిత్యావసర వస్తువుల ధరలు 300% పెరిగినా కనీస వేతనాలు సవరిం చకుండా కార్పొరేట్ శక్తులకే ప్రభుత్వాలు కొమ్ము కాస్తున్నాయని మండిపడ్డారు. ఇతర రాష్ట్రాల తరహాలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వా లని, నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న స్కూల్ ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు,పంచాయతీ కార్మికుల బకాయిలు, పీఎఫ్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేబర్‌కోడ్ల పేరుతో కార్మికచట్టాలు, భద్రతా ప్రమాణాలను నిర్వీర్యం చేయడం వల్లే పరిశ్రమల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయని హెచ్చరించిన ఆయన, ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు జి. నాగమల్లేశ్వ రమ్మ, వై. కనకదుర్గ, అనూష, ఆదిన, క్రీస్తుదానం, మోహన రాణి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# మనం వాడుతున్న ప్రోబయోటిక్ ట్యాబ్లెట్లపై ఆసక్తికర అధ్యయనం.. అవి మనకు సరిపోవట.. ఎందుకంటే..




మన జీర్ణవ్యవస్థలో ఉండే సూక్ష్మజీవులు ఆహారం, జీవనశైలి, తరతరాల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మారుతూ ఉంటాయి. అందుకే అందరికీ ఒకే రకమైన ప్రోబయోటిక్ ఉత్పత్తులు సమానంగా పనిచేస్తాయా అనే ప్రశ్న ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. దేశంలోని వివిధ గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌ను పరిశీలించిన తాజా పరిశోధనలో ఇప్పటివరకు గుర్తించని కొన్ని బ్యాక్టీరియా జాతులతోపాటు వందలాది స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లు బయటపడటం ఈ అంశంపై కొత్త చర్చకు దారితీసింది. దేశంలోని కొన్ని గిరిజన సముదాయాలకు చెందిన ఆరోగ్యవంతుల గట్ మైక్రోబయోమ్‌ను పరిశోధకులు పరిశీలించారు. ఈ సముదాయాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు ఒకదానికొకటి భిన్నంగా ఉన్నాయి. కొందరు ఎక్కువగా పాల ఉత్పత్తులు, సంపూర్ణ ధాన్యాలు తీసుకుంటుండగా, మరికొందరి ఆహార విధానాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి. ఈ పరిశీలనలో ఆహారపు అలవాట్లకు, గట్‌లో నివసించే బ్యాక్టీరియా లక్షణాలకు మధ్య ఆసక్తికరమైన సంబంధం కనిపించింది.

## ఆహారాల్లో తేడాలే కారణం..

తరతరాలుగా కొనసాగుతున్న ఆహారపు అలవాట్లు గట్‌లోని బ్యాక్టీరియాపై ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతున్నట్లు పరిశోధన సూచించింది. సాధారణంగా కనిపించే బిఫిడోబ్యాక్టీరియం అడోలెసెంటిస్ వంటి బ్యాక్టీరియాలోనూ పాశ్చాత్య దేశాల ప్రజల గట్ నమూనాల్లో అరుదుగా కనిపించే కార్బోహైడ్రేట్ ప్రాసెసింగ్ జన్యువులను గుర్తించారు. అంటే భారతీయుల సంప్రదాయ ఆహారంలో ఉండే కొన్ని పదార్థాలను జీర్ణం చేసుకోవడానికి ఇక్కడి గట్ బ్యాక్టీరియా కాలక్రమేణా ప్రత్యేకంగా అనుకూలించి ఉండే అవకాశం ఉంటుంది. బార్లీ, గోధుమలు, సంప్రదాయ పాల ఉత్పత్తులు వంటి ఆహార పదార్థాలను జీర్ణం చేసుకోవడంలో సహాయపడే కొన్ని ప్రత్యేక లక్షణాలు స్థానిక బ్యాక్టీరియాలో కనిపించినట్లు పరిశోధన వెల్లడించింది. దీని ద్వారా మనం తీసుకునే ఆహారం కేవలం మన శరీరాన్నే కాకుండా, మన గట్‌లో నివసించే సూక్ష్మజీవుల సముదాయాన్ని కూడా ప్రభావితం చేస్తుందని అర్థమవుతోంది. ఇప్పటివరకు మార్కెట్లో లభించే అనేక ప్రోబయోటిక్ ఉత్పత్తుల్లో యూరప్, ఉత్తర అమెరికా వంటి పాశ్చాత్య ప్రాంతాల ప్రజల్లో గుర్తించిన బ్యాక్టీరియా స్ట్రెయిన్లను ఉపయోగిస్తున్నారు. మంచి బ్యాక్టీరియాగా పరిగణించే ఒక స్ట్రెయిన్ ఎక్కడి వ్యక్తి గట్‌లోకి వెళ్లినా ఒకే విధంగా పనిచేస్తుందనే ఆలోచన దీనికి కారణం. అయితే తాజా పరిశోధన ఈ విధానాన్ని మరోసారి ఆలోచించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.

## ప్రోబయోటిక్స్ ఆపేయాలా..

ఒక నిర్దిష్ట ఆహార విధానానికి, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా అభివృద్ధి చెందిన బ్యాక్టీరియా మరో రకమైన ఆహారపు అలవాట్లు ఉన్న వ్యక్తి గట్‌లోకి వెళ్లినప్పుడు అదే స్థాయిలో స్థిరపడవు. అలాగే అక్కడ ఉన్న సూక్ష్మజీవుల సముదాయంతో కలిసి అదే విధంగా పనిచేయవు. అందువల్ల ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సమాన ప్రయోజనం ఇస్తుందనే భావనను పరిశోధన ప్రశ్నిస్తోంది. అయితే దీనర్థం మార్కెట్లో లభించే ప్రోబయోటిక్స్ అన్నింటినీ వెంటనే ఆపేయాలని కాదు. ప్రోబయోటిక్స్ అనే భావనను తిరస్కరించడం కంటే, ఏ బ్యాక్టీరియా స్ట్రెయిన్ ఎవరికి, ఏ ఆహార విధానం ఉన్న వ్యక్తులకు, ఏ గట్ మైక్రోబయోమ్ నేపథ్యంలో ఉపయోగపడుతుందనే అంశంపై మరింత పరిశోధన అవసరమని ఈ పరిశోధన సూచిస్తోంది. భారతీయుల గట్‌కు అనుగుణంగా స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లను గుర్తించి, వాటిపై పరిశోధనలు చేసి, అవసరమైన పరీక్షలు నిర్వహించి ప్రోబయోటిక్ ఉత్పత్తులను అభివృద్ధి చేసే అవకాశం భవిష్యత్తులో పెరుగుతుంది. ముఖ్యంగా భారతీయుల సంప్రదాయ ఆహార విధానాలు, స్థానిక ఆహార పదార్థాలు, గట్‌లో ఇప్పటికే ఉన్న సూక్ష్మజీవుల సముదాయాన్ని పరిగణనలోకి తీసుకుని రూపొందించే విధానాలు మరింత ఉపయోగకరంగా ఉంటాయనే ఆలోచనకు ఈ పరిశోధన బలం చేకూరుస్తోంది.

## ఒక్క ట్యాబ్లెట్ కీలకం కాదు..

గట్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఒక్క ప్రోబయోటిక్ సప్లిమెంట్‌పైనే ఆధారపడాల్సిన అవసరం లేదని కూడా ఈ అంశం గుర్తుచేస్తోంది. వైవిధ్యమైన, పీచు పదార్థాలు అధికంగా ఉండే సంప్రదాయ ఆహారాన్ని తీసుకోవడం గట్‌లోని సూక్ష్మజీవుల వైవిధ్యానికి అనుకూలంగా ఉంటుంది. ఒక నిర్దిష్ట ప్రోబయోటిక్‌ను కేవలం ప్రకటనలు లేదా మార్కెటింగ్ ఆధారంగా ఎంచుకోవడం కంటే, అవసరం ఉంటే వైద్య నిపుణుల సలహాతో తీసుకోవడం మంచిది. దేశంలోని గిరిజన సముదాయాల గట్ మైక్రోబయోమ్‌పై జరిగిన ఈ పరిశోధన దేశంలో ఇప్పటివరకు పెద్దగా గుర్తించని సూక్ష్మజీవుల వైవిధ్యాన్ని వెలుగులోకి తీసుకు వచ్చింది. భవిష్యత్తులో మరిన్ని స్థానిక బ్యాక్టీరియా స్ట్రెయిన్లపై పరిశోధనలు జరిగితే భారతీయుల ఆహార విధానం, గట్ మైక్రోబయోమ్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన ప్రోబయోటిక్స్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. అంటే విదేశాల్లో అభివృద్ధి చేసిన ఒకే రకమైన ప్రోబయోటిక్ అందరికీ సరిపోతుందా అనే ప్రశ్నకు బదులుగా, వ్యక్తి ఆహారం, గట్ మైక్రోబయో మ్‌కు అనుగుణంగా సరైన బ్యాక్టీరియాను ఎంచుకోవడంపై భవిష్యత్తు పరిశోధనలు దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది.

# విటమిన్ బి12 లోపంతో ఆందోళన పెరుగుతుందా ? నిపుణులు ఏం చెబుతున్నారంటే..

ఆందోళన, చిరాకు, అలసట వంటి సమస్యలకు ఒత్తిడి లేదా మానసిక ఆరోగ్య పరిస్థితులే కారణమని చాలామంది భావిస్తారు. అయితే శరీరంలో కొన్ని ముఖ్యమైన పోషకాలు లోపించినా ఇలాంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంగుంది. ముఖ్యంగా విటమిన్ బి12 లోపం మెదడు పనితీరు, నాడీ వ్యవస్థ, మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో బి12 స్థాయిలు తగ్గడం వల్ల ఆందోళనను పోలిన లక్షణాలు కూడా కనిపిస్తాయి. అయితే ప్రతి వ్యక్తిలో దీని ప్రభావం ఒకేలా ఉండదు. విటమిన్ బి12 నాడులు సక్రమంగా పనిచేయడానికి, మెదడు మధ్య సమాచార మార్పిడికి అవసరమైన న్యూరోట్రాన్స్‌మిటర్ల తయారీలో కీలక పాత్ర పోషిస్తుంది. అందువల్ల శరీరంలో బి12 తగినంతగా లేకపోతే ఆందోళన, చిరాకు, భయాందోళన, మానసిక స్థితిలో మార్పులు, తక్కువ ఉత్సాహం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుంది. విటమిన్ బి12ని కోబాలమిన్ అని కూడా పిలుస్తారు. ఇది నీటిలో కరిగే విటమిన్. మెదడు పనితీరు, నాడుల ఆరోగ్యం, ఎర్ర రక్త కణాల తయారీ, డీఎన్ఏ నిర్మాణం వంటి అనేక ముఖ్యమైన ప్రక్రియలకు ఇది అవసరం. శరీరం తగినంత బి12ను స్వయంగా తయారు చేసుకోలేకపోవడంతో ఆహారం ద్వారా పొందాలి. చేపలు, గుడ్లు, పాలు, పాల ఉత్పత్తులు, చికెన్, మాంసం వంటి వాటిలో విటమిన్ బి12 లభిస్తుంది.

## నాడీ వ్యవస్థ ఆరోగ్యానికి..

నాడీ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటంలో విటమిన్ బి12కి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. నరాలపై ఉండే మైలిన్ అనే రక్షణ పొరను నిర్వహించడంలో ఇది సహాయపడుతుంది. ఈ రక్షణ పొర సరిగ్గా ఉంటే మెదడు, వెన్నుపాము, శరీరంలోని ఇతర భాగాల మధ్య విద్యుత్ సంకేతాలు సక్రమంగా ప్రసారం అవుతాయి. బి12 లోపం ఏర్పడినప్పుడు నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఎర్ర రక్త కణాల తయారీలోనూ బి12 కీలక పాత్ర పోషిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే ఎర్ర రక్త కణాల ఉత్పత్తి ప్రభావితమై మెగాలోబ్లాస్టిక్ అనీమియా వంటి సమస్యలు ఏర్పడతాయి. దాంతో శరీరానికి ఆక్సిజన్ సరఫరా సరిగా జరగక అలసట, బలహీనత, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మెదడు ఆరోగ్యానికి కూడా బి12 అవసరం. ఈ విటమిన్ స్థాయిలు చాలా తక్కువగా ఉన్నప్పుడు జ్ఞాపకశక్తి తగ్గడం, ఆలోచనా సామర్థ్యంలో మార్పులు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. తీవ్రమైన లోపం ఉన్నప్పుడు మరింత తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలు కూడా ఏర్పడే అవకాశం ఉంటుంది.

## ఆందోళన పెరుగుతుందా..

విటమిన్ బి12 లోపం ఆందోళన లక్షణాలను పెంచడానికి ఒక కారణం అవుతుందని చెబుతున్నారు. శరీరంలో బి12 తక్కువగా ఉన్నప్పుడు మెదడు పనితీరుకు అవసరమైన కొన్ని రసాయన ప్రక్రియలు ప్రభావితమవుతాయి. ముఖ్యంగా హోమోసిస్టీన్ అనే పదార్థాన్ని మెథియోనిన్‌గా మార్చే ప్రక్రియలో బి12 అవసరం. ఈ ప్రక్రియ మెదడు పనితీరు, మానసిక స్థితి నియంత్రణకు సంబంధించిన జీవరసాయన చర్యల్లో భాగం. బి12 లోపం వల్ల అలసట, బలహీనత, మెదడు మబ్బుగా అనిపించడం వంటి సమస్యలు కూడా వస్తాయి. ఇవి రోజువారీ పనితీరుపై ప్రభావం చూపడంతో కొందరిలో ఆందోళన మరింత ఎక్కువగా అనిపించే అవకాశం ఉంటుంది. అలాగే నాడీ వ్యవస్థ పనితీరు దెబ్బతినడం వల్ల చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, గుండె వేగంగా కొట్టుకోవడం, తల తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కొన్నిసార్లు పానిక్ అటాక్ లక్షణాలను పోలి ఉంటాయి.

## ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి..

విటమిన్ బి12 లోపం ఉన్నప్పుడు శారీరక లక్షణాలతోపాటు నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయి. తీవ్రమైన అలసట, బలహీనత, చర్మం పాలిపోయినట్లు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం వంటి సమస్యలు వస్తాయి. చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, సమతుల్యత కోల్పోవడం, జ్ఞాపకశక్తి సమస్యలు, మెదడు మబ్బుగా అనిపించడం వంటి నాడీ సంబంధిత లక్షణాలు కూడా కనిపించే అవకాశం ఉంటుంది. మానసిక ఆరోగ్యానికి సంబంధించి ఆందోళన, చిరాకు, డిప్రెషన్, మూడ్‌లో మార్పులు, ఏకాగ్రత లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఇలాంటి లక్షణాలు కనిపించిన ప్రతిసారీ బి12 లోపమే కారణమని భావించకూడదు. ఆందోళనకు అనేక ఇతర కారణాలు కూడా ఉంటాయి. కొంతమందిలో విటమిన్ బి12 లోపం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా పూర్తిగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారిలో బి12 లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది. సహజంగా బి12 లభించే మొక్కల ఆధారిత ఆహార పదార్థాలు చాలా తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణం. వయసు పెరిగే కొద్దీ బి12 శోషణ తగ్గే అవకాశం ఉన్నందున వృద్ధుల్లోనూ లోపం కనిపిస్తుంది.

## జీర్ణ వ్యవస్థ సమస్యలు ఉంటే..

జీర్ణవ్యవస్థకు సంబంధించిన సమస్యలు ఉన్నవారిలోనూ ఆహారం నుంచి బి12 శరీరంలోకి శోషించుకోవడం తగ్గుతుంది. అలాగే మెట్‌ఫార్మిన్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి కొన్ని మందులను దీర్ఘకాలం ఉపయోగించే వారు కూడా బి12 స్థాయిలపై వైద్యుల సలహా తీసుకోవాల్సి ఉంటుంది. బి12 లోపం ఉన్నవారికి లోపాన్ని సరిచేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది. అయితే బి12 స్థాయిలు సాధారణంగా ఉన్న ప్రతి ఒక్కరూ అదనంగా బి12 సప్లిమెంట్లు తీసుకోవాల్సిన అవసరం లేదు. సాధారణ బి12 స్థాయిలు ఉన్నవారిలో కేవలం సప్లిమెంట్లు తీసుకోవడం ద్వారా ఆందోళన గణనీయంగా తగ్గుతుంది. ఎప్పటికప్పుడు లేదా నిరంతరం ఆందోళనగా అనిపించడం, కారణం తెలియని తీవ్రమైన అలసట, చేతులు లేదా కాళ్లలో తిమ్మిర్లు, జ్ఞాపకశక్తి సమస్యలు, సమతుల్యతలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఉంటే విటమిన్ బి12 స్థాయిలను పరీక్షించుకోవడం గురించి వైద్యుడిని సంప్రదించవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలంగా శాకాహార లేదా వేగన్ ఆహారం తీసుకునేవారు బి12 స్థాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

## వైద్య పరీక్షలు అవసరం..

విటమిన్ బి12 లోపం కొన్ని సందర్భాల్లో ఆందోళనను పోలిన లక్షణాలకు లేదా నాడీ సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది. అయితే ఆందోళనకు బి12 లోపమే ఏకైక కారణమని చెప్పలేం. లక్షణాలను బట్టి సరైన వైద్య పరీక్షలు చేయించుకుని అసలు కారణాన్ని గుర్తించడం చాలా ముఖ్యం. బి12 లోపం నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు ఆహారం లేదా సప్లిమెంట్ల ద్వారా దాన్ని సరిచేసుకోవాలి.




# భోజనం చేశాక పండ్లను తినాలా.. వైద్య నిపుణులు ఏం చెబుతున్నారు..?


భోజనం తర్వాత పండ్లు తినడం ఆరోగ్యకరమైన అలవాటుగా చాలామంది భావిస్తారు. ముఖ్యంగా మామిడి, యాపిల్, బొప్పాయి వంటి పండ్లను భోజనం అనంతరం స్వీట్లకు ప్రత్యామ్నాయంగా తీసుకోవడం సాధారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో పులిసిపోయి గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలకు దారితీస్తాయనే వాదనలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఈ వాదనల్లో వాస్తవం ఎంత? నిజంగా పండ్లను ఎప్పుడు తింటే మంచిది? నిపుణుల సూచనల ప్రకారం ఇలా ఉన్నాయి. భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే అవి కడుపులో కుళ్లిపోతాయనే వాదనకు శాస్త్రీయ ఆధారం లేదు. మన కడుపులో హైడ్రోక్లోరిక్ యాసిడ్ ఉంటుంది. దీని ఆమ్లత్వం కారణంగా కడుపులో పండ్లు బ్యాక్టీరియా ద్వారా పులిసిపోయే పరిస్థితి ఉండదు. అయితే పండ్లను కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కొవ్వులు అధికంగా ఉన్న భోజనం తర్వాత తీసుకుంటే కడుపు ఖాళీ కావడానికి కొంత ఎక్కువ సమయం పడుతుంది. ఇది జీర్ణక్రియలో సహజమైన ప్రక్రియే తప్ప, ఏదైనా సమస్యకు సంకేతం కాదు.

## పీచు పదార్థంతో మేలు..

పండ్లలో ఉండే కరిగే పీచు పదార్థం, ముఖ్యంగా యాపిల్, సిట్రస్ పండ్లలో లభించే పెక్టిన్, కడుపు నుంచి ఆహారం బయటకు వెళ్లే వేగాన్ని కొంత తగ్గిస్తుంది. దీని వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలుగుతుంది. అలాగే ఆహారంలోని పోషకాలు శరీరంలోకి క్రమంగా శోషించేందుకు ఇది సహాయపడుతుంది. వేగంగా రక్తంలో చక్కెర పెరగకుండా కూడా పీచు కొంతవరకు సహకరిస్తుంది. అయితే భోజనంతోపాటు లేదా వెంటనే పండ్లు తినడం వల్ల ప్రతి ఒక్కరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు. ఖాళీ కడుపుతో పండ్లు తింటే వాటిలోని సహజ చక్కెరలు చిన్న ప్రేగులకు వేగంగా చేరుతాయి. భోజనం తర్వాత పండ్లు తింటే ప్రధాన ఆహారంలోని పీచు, ప్రోటీన్, కొవ్వు కారణంగా జీర్ణక్రియ కొంత నెమ్మదిస్తుంది. ఫలితంగా ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండటానికి ఇది సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిల విషయంలోనూ పండ్లను భోజనంతో కలిపి తీసుకోవడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా టైప్-2 మధుమేహం లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు పండ్లను ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి తీసుకుంటే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కొంత నియంత్రణలో ఉండే అవకాశం ఉంటుంది. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులను బట్టి ఆహార ఎంపికలు మారుతాయి.

## సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

మరోవైపు సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి మాత్రం భోజనం చేసిన వెంటనే ఎక్కువ మొత్తంలో పండ్లు తినడం అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా పుచ్చకాయ, బేరి, ద్రాక్ష వంటి ఫ్రక్టోజ్ అధికంగా ఉండే పండ్లను ఇప్పటికే నిండుగా ఉన్న కడుపుపై ఎక్కువ పరిమాణంలో తీసుకుంటే గ్యాస్, పొట్ట ఉబ్బరం, అసౌకర్యం వంటివి కనిపిస్తాయి. ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (IBS) ఉన్నవారిలో ఈ సమస్య మరింత స్పష్టంగా ఉంటుంది. భోజనంతో పాటు పండ్లు తీసుకోవడం వల్ల మరో ప్రయోజనం కూడా ఉంటుంది. విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, జామ, కివీ వంటి పండ్లు పప్పులు, పాలకూర, సంపూర్ణ ధాన్యాల్లో ఉండే మొక్కల ఆధారిత ఇనుము శరీరంలో శోషించేందుకు సహాయపడతాయి. అందువల్ల కొన్ని సందర్భాల్లో ప్రధాన భోజనంతో పండ్లు తీసుకోవడం పోషకాల శోషణకు ఉపయోగకరంగా ఉంటుంది. పండ్లు తినడానికి ఒకే ఒక్క ఉత్తమ సమయం అంటూ కచ్చితమైన నియమం లేదు. పండ్లను ఎప్పుడు తింటున్నామన్న



దానికంటే రోజువారీ ఆహారంలో వాటిని తగిన పరిమాణంలో చేర్చుకోవడం ముఖ్యం. భోజనం తర్వాత పండ్లు తిన్నప్పుడు బరువుగా లేదా పొట్ట ఉబ్బరంగా అనిపిస్తే, వాటిని భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో తీసుకోవచ్చు. ఉదయం 11 గంటల సమయంలో లేదా సాయంత్రం 4 గంటల సమయంలో చిరుతిండిగా తీసుకోవడం కూడా ఒక ఎంపిక.

## ఏ సమయంలో తినాలి..

పండ్లను ఎక్కువ పరిమాణంలో ఒకేసారి తినకుండా తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. ఉదాహరణకు చిన్న యాల్ లేదా కొద్దిగా బెర్రీలు సరిపోతాయి. ముఖ్యంగా అధిక కేలరీల భోజనం చేసిన వెంటనే పెద్ద గిన్నె నిండా పండ్లు తినడం అవసరం లేదు. పండ్ల రసాల కంటే సంపూర్ణ పండ్లకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. పండ్లను రసంగా మార్చినప్పుడు పీచు పదార్థంలో కొంత భాగం తొలగిపోతుంది. దీంతో సహజ చక్కెరలు శరీరంలోకి వేగంగా చేరే అవకాశం ఉంటుంది. సంపూర్ణ పండ్లలోని పీచు జీర్ణక్రియను నియంత్రించడంలో, రక్తంలో చక్కెర వేగంగా పెరగకుండా చూడడంలో సహాయపడుతుంది. గ్యాస్ట్రో-ఈసోఫేజియల్ రిఫ్లక్స్ (+జు=ణ) సమస్య ఉన్నవారు కూడా పండ్ల ఎంపిక, సమయంపై కొంత జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా రాత్రి ఆలస్యంగా నారింజ, నిమ్మ వంటి సిట్రస్ పండ్లు తీసుకోవడం వల్ల కొందరిలో యాసిడ్ రిఫ్లక్స్ లక్షణాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఆరోగ్యంగా ఉన్న చాలా మందికి భోజనం చేసిన వెంటనే పండ్లు తినడం హానికరం కాదు. పండ్లు కడుపులో కుళ్లిపోవడం లేదా పులిసిపోవడం వల్ల జీర్ణక్రియ దెబ్బతింటుందనే వాదనకు ఆధారం లేదు. అయితే సున్నితమైన జీర్ణవ్యవస్థ, తరచూ పొట్ట ఉబ్బరం వంటి సమస్యలు ఉన్నవారు భోజనం తర్వాత ఒకటి నుంచి రెండు గంటల విరామంతో పండ్లు తీసుకోవడం ద్వారా అసౌకర్యాన్ని తగ్గించుకోవచ్చు. చివరికి పండ్లను ఏ సమయంలో తింటున్నామన్న దానికంటే, వాటిని సరైన పరిమాణంలో, సంపూర్ణ రూపంలో తీసుకోవడం, మన శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం మరింత ముఖ్యమైన విషయమని నిపుణులు చెబుతున్నారు.

# మహాత్ముడిపైనా కేసు పెట్టండి

**జాతీయ గీతాన్ని పూర్వపు రూపంలోనే పాడాం**

**మాది తప్పయితే గాంధీ, నెహ్రూ, వాజపేయిది కూడా తప్పే**

**వారిపై కూడా ఫిర్యాదు చేయండి**

**వందేమాతరం వివాదంపై ఖర్గే ఘాటు వ్యాఖ్యలు**

**నన్ను జైలులో పెట్టాలని చూస్తున్నారు: సోనియా గాంధీ**



**న్యూఢిల్లీ:** వందేమాతరం వివాదం ఇప్పుడు రాజకీయంగా మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు ఆ పార్టీనేతసోనియాగాంధీ కూడా తీవ్రంగా స్పందించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై దాఖలైన ఫిర్యాదులోని ప్రాతిపదికను ఖర్గే ప్రశ్నించారు. జాతీయ గీతాన్ని (వందేమాతరం) దాని పూర్వపు రూపంలో పాడటం నేరమైతే, మహాత్మా గాంధీతో పాటు మాజీ ప్రధాను లు జవహర్ లాల్ నెహ్రూ, అటల్ బిహారీ వాజ్పేయిలపై కూడా ఫిర్యాదులు నమోదు చేయాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ఫిర్యాదు చేసిన వారిని ఉద్దేశించి మహాత్మా గాంధీపై కూడా కేసు పెట్టండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వందే మాతరం పాడినందుకు మాపై ఫిర్యాదు చేస్తే, అదే పాటను గౌరవించిన మహాత్మా గాంధీ, జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్ వంటి నాయకులపై కూడా కేసులు పెట్టాలి అని అన్నారు.వందే మాతరం స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచే కాంగ్రెస్ సమావేశాల్లో పాడు తున్నారని, గాంధీజీ కడా ఈ గీతానికి ప్రాధాన్యత ఇచ్చారని ఖర్గే గుర్తు చేశారు.

### నేను ఎమ్మెల్యే అయినప్పుడు అమిత్ షా చిన్న పిల్లాడు..

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గోవాలో జరిగిన బహిరంగ సభలో ఖర్గే మాట్లాడుతూ.. "నేను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు అమిత్ షా ఇంకా పుట్ట పుట్టలేదు. అలాంటిది ఇప్పు డు ఆయన మాకు దేశభక్తి గురించి పాఠాలు చెబుతు న్నారు.అంటూ ఎద్దేవా చేశారు. మా ప్రజలు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడారు. మీరు పోరాడారా? ఏ బీజేపీ నాయకుడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నా రు? ఏ ఆర్ఎస్ఎస్ నాయకుడు పాల్గొన్నారు? అలాంట ప్పుడు మాకు దేశభక్తి గురించి పాఠాలు చెబుతారా?" అంటూ ఖర్గే ప్రశ్నించారు.

### బీజేపీ ఆరోపణలకు కాంగ్రెస్ ఖండన

కాంగ్రెస్ నేతలు మాత్రం చీజేపీ ఆరోపణలను ఖండించారు. సోనియా గాంధీ పాటను ఆపాలని చెప్పలేదని, కార్యక్రమ నిర్వహణకు సంబంధించి మాత్రమే సంకేతాలు ఇచ్చారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. అలాగే కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఎక్కువసేపు నిలబడలేని ఆరోగ్య పరిస్థితిలో ఉండటంతో కార్యక్రమ నిర్వహణపై సూచనలు ఇచ్చారని పేర్కొన్నారు. చీజేపీ వాదబీజేపీ మాత్రం ఇది జాతీయ గీతానికి అవ మానమని ఆరోపిస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.వందేమాతరం గీతంపై సోనియాగాంధీ మంగళవారం స్పందించారు. తనను జైలుకు పంపించేందుకే కేంద్రంలోని బీజేపీ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని ఆమె ఆరోపించారు. వారి కుట్రలకు తాను భయపడనని, జైలు కు వెళ్లేందుకు తానేమీ భయపడటం లేదని, జైలుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

### సోనియా రక్తంలో ఇటాలియన్ మూలాలు

### కేంద్ర మంత్రికుమారస్వామి

వందే మాతరం వివాదం నేపథ్యం లో కేంద్ర మంత్రి, జేడీఎస్ నేత హెచ్.డి. కుమారస్వామి కాంగ్రెస్ నేత సోనియా గాంధీపై మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోనియా గాంధీ భారతీ యురాలు కాదని, ఆమె ఇటలీకి చెందిన వారని, ఆమె రక్తంలో ఇటాలియన్ మూలాలే ఉన్నాయని వ్యాఖ్యానిం చా రు.వందే మాతరం విషయంలో కాంగ్రెస్ వివరణను కుమా రస్వామి ప్రశ్నించారు. ఆమె భారత్ కోసం ఏం త్యాగం చేశా రు? ఆమె భర్త రాజీవ్ గాంధీ త్యాగం చేశారు.. కానీ సోనియా గాంధీ ఏం త్యాగం చేశారు? అంటూ ప్రశ్నించారు. వివాహం తర్వాత ఆమె భారత్కు వచ్చారని, అందువల్ల భారతీయ భావోద్వేగాలను ఆమె వ్యతిరేకిస్తున్నారని ఆరోపించారు.

# నేను కూడా దిమాగీ నక్సలైట్‌నే

### ప్రధాని మోడీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ కామెంట్

**న్యూఢిల్లీ :** ప్రశ్నించే వారంతా దిమాగీ నక్సల్స్ అంటూ తాజాగా ఆప్ కనన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఇప్పటికే చిదంబరం తదితరులు ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా అరవింద్ కేజ్రీవాల్ కూడా మోడీ వ్యాఖ్యలకు ఘాటుగానే స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దిమాగీ నక్సల్స్ అంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై దుమారం రేగుతూనే ఉంది. మోదీ వ్యాఖ్యలపై స్పందించిన ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్.. తను దిమాగీ నక్సల్ అయినందుకు గర్వపడుతున్నానని చెప్పారు. తను నిజమైన దేశభక్తుడినని.. బీజేపీకి భయపడేవాడిని కాదని అన్నారు. 80వ స్వాతంత్ర్య వేడుకల్లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదం అయిన విషయం తెలిసిందే. దేశంలో ఆయుధాలు పట్టి అడవుల్లో ఉండే నక్సల్స్ ను అంతం చేశామని.. దిమాగీ నక్సల్స్ హింసను ప్రేరేపించేందుకు ఎదురు చూస్తున్నారని.. సమాజాన్ని తప్పుడు దోవ పట్టించేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ల÷ర్యంగా ప్రశ్నించే వారు దిమాగీ నక్సల్స్.. ఎవరైతే బీజేపీకి భయపడకుండా ప్రశ్నిస్తారో వాళ్లంతా మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్స్. ఒకవేళ భగత్ సింగ్ , అంబేద్కర్ ఇప్పటికీ బతికే ఉంటే.. వాళ్లను కూడా ప్రధాని మోదీ.. దిమాగీ నక్సల్స్ అనేవారేమోనని మండిపడ్డారు. జవాబుదారీ వ్యవస్థ, అవినీతి లేని సమాజం, ప్రజలకు సౌకర్యాలు, హాస్పిటల్స్ స్కూల్స్, , డ్రైనేజీ సిస్టమ్ మొదలైన వాటిపై ప్రశ్నించే వారు మోదీ దృష్టిలో దిమాగీ నక్సల్సేనా అని ప్రశ్నించారు. నేను నిజమైన దేశ భక్తుడిని అందుకే నేను దిమాగీ నక్సల్.. అంటూ చెప్పుకొచ్చారు.

# 29న రైతు పంచాయితీకి సిద్ధం అవుతున్న పంజాబ్ రైతులు

**న్యూఢిల్లీ :** ప్రతిపాదిత భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా పంజాబ్ రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా జగ్జీత్ దల్లేవాల్ నేతృత్వంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో 29న దేశ రాజధానిలో 'రైతు పంచాయతీ' జరుగనున్నది. కాగా ఆదివారం ఢిల్లీ మార్చ్‌కు బయలుదేరిన వందలాది మంది రైతులను పంజాబ్ వైపున గల ఖానౌరీ సరిహద్దు వద్ద జింద్ పోలీసులు అడ్డుకున్నారు. బారికేడింగ్‌తో ఆ మార్గాన్ని సీల్ చేశారు. జగ్జీత్ దల్లేవాల్ హర్యానా- పంజాబ్ సరిహద్దులోని దాతాసింగ్ వాలా గ్రామం నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వరకు 'కిసాన్ బచావో పాదయాత్ర నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇది ఆగస్టు 29న రాజధానిలో 'రైతు పంచాయతీ'తో ముగుస్తుందని తెలియజేశారు. క్రిసాన్ మోర్చా ప్రతినిధులకు హర్యానా అధికారులకు మధ్య జరిగిన మూడు రౌండ్ల చర్చలు అసంపూర్తిగా మిగిలిపోయాయి.

# హోర్ముజ్. అమెరికా కొత్త భూభాగం!

**జలసంధి తమదేనంటూ ట్రూత్ సోషల్లో మ్యాప్ను పోస్టు చేసిన ట్రంప్**

**ఇరాన్తో చర్చలు జరగడం లేదని వెల్లడి**

**యుద్ధంలో విజయం సాధించింది మేమే**

**చర్చల కోసం అమెరికా అడుక్కుంటోంది**

**హోర్ముజ్పై ట్రంప్ భ్రమలను తొలగిస్తాం**

**దిగ్బంధం, ఆంక్షలు ఎత్తివేసేదాకా**


**జలసంధిని తెరిచే ప్రసక్తే లేదు: ఇరాన్**

**వాషింగ్టన్ :** హోర్ముజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటా మంటూ తరచూ ప్రకటనలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. తాజాగా ఆ జలసంధి అమెరికాలో కలిసిన కొత్త భూభాగమని పేర్కొ న్నారు. హోర్ముజ్ జలసంధికి సంబంధించిన మ్యాప్ను మంగళవారం ట్రూత్ సోషల్లో పోస్టు చేశారు. "ఇరాన్తో ఎలాంటి చర్చలుగానీ, సంప్ర దింపులుగానీ జరపడం లేదు. చర్చల కోసం ఎలాంటి షెడ్యూల్ కూడా లేదు. ఇరాన్ నౌకల దిగ్బంధం పూర్తిస్థాయిలో కొనసాగుతోంది. హోర్ముజ్ ప్రాంతంలో సముద్ర మందుపాతరల (సీమైన్ల)ను తొలగించాం" అని ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు, అమెరికా చర్చల కోసం తమను అడు క్కుంటోందని, ఇరాన్ షరతుల మేరకు చర్చలకు సిద్ధమని చెబుతోందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. అమెరికా నౌకా దిగ్బంధాన్ని, ఇరాన్ చమురు విక్రయాలపై ఆంక్షలను ఎత్తివేసేదాకా హోర్ముజ్ జలసంధిని తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ ఘలీబఫ్ మరోసారి స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి విషయంలో ట్రంప్ భ్రమల్లో ఉన్నారని, త్వరలోనే ఆ భ్రమలు తొలగిపోతాయని ఇరాన్ విదేశాంగశాఖ ఉప మంత్రి ఘరిబాబాదీ వ్యాఖ్యానించారు.

# ఉరిశిక్షను రద్దు చేయండి

### ఇతర సులువైన మరణాలను ప్రసాదించండి

### సుప్రీంలో దాఖలైన పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ :** మరణశిక్ష పడిన దోషులను ఉరిశిక్ష నుంచి తప్పించి, సులువుగా మరణించే ప్రక్రియను చేపట్టాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. భారతీయ శిక్షా స్మృతిలో భాగంగా కొన్ని కేసుల్లో ఉరి తీస్తున్న విషయం తెలిసిందే. అయితే ఉరి వేసి దోషిని చంపే ప్రయత్నాలను ఆపేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలైంది. ఉరికి బదులుగా, మరేదైనా నొప్పిలేని విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దాఖలైన పిల్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కాలం చెల్లిన ఉరి విధానాన్ని బహిష్కరించి, దాని స్థానంలో నొప్పి లేకుండా మరణశిక్షను అమలు చేసే విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సుప్రీంలో పిటీషన్ దాఖలైంది. అయితే ఆ పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది. ఇక ఈ కేసులో ఇదే తుది తీర్పు కాదని, భవిష్యత్తులో ఈ అంశాన్ని మళ్లీ ప్రస్తావించవచ్చు అని, ఒకవేళ ప్రత్యామ్నాయ మరణాలపై ఏవైనా శాస్త్రీయ ఆధారాలు ఉంటే, దాని ప్రకారం మరణశిక్షను అమలు చేయవచ్చని కోర్టు తన తీర్పులో అభిప్రాయపడింది. ప్రస్తుతం రిట్ పిటీషన్‌ను డిస్మిస్ చేస్తున్నామని, కానీ భవిష్యత్తులో రాజ్యాంగం ధర్మాసనం ఈ విధానంపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉంటుందని కోర్టు తెలిపింది. శాస్త్రీయ విధానాల్లో మరణశిక్షను అమలు చేసే అంశంలో కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని కోర్టు అభిప్రాయపడింది. సీనియర్ న్యాయవాది రిషి మల్హోత్రా 2017లో ఈ పిల్ దాఖలు చేశారు. సీఆర్పీసీలోని సెక్షన్ 354(5) కింద ఉరి ద్వారా మరణశిక్షను అమలు చేసే వారు. అయితే ఆ సెక్షన్‌ను సవాల్ చేస్తూ కోర్టులో పిటీషన్ వేశారు. మరణశిక్ష అమలులో భాగంగా ఉరికి బదులుగా ప్రాణాంతక ఇంజెక్షన్ ఇవ్వాలని పిటీషనర్ అభిప్రాయపడ్డారు. అనేక దేశాలు ఉరి తీయడానికి బదులుగా ప్రత్యామ్నాయ రీతిలో మరణశిక్షలను అమలు చేస్తున్నాయన్నారు. మరణశిక్ష అమలు రీతిలపై ప్రభుత్వం ఉన్నత స్థాయిలో చర్చిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి తెలిపారు. విషపూరిత ఇంజెక్షన్ ద్వారా మరణశిక్ష అమలు చేసే విధానం విజయవంతంగా జరగడంలేదని సీనియర్ న్యాయవాది మీనాక్షి అరోరా వాదించారు. ఈ అంశంలో కమిటీని ఏర్పాటు చేయాలని ఆ న్యాయవాది కోరారు.

# పెన్షన్ కోసం వయోవృద్ధుల ఎదురుచూపు

### కొత్త ప్రకటనలో అవకాశం లేకపోవడంపై ఆందోళన

**హైదరాబాద్,ఆగస్ట్18:** రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు నూతన చేయూత పింఛన్ల మంజూరుకు కసరత్తు ప్రారంభించి, అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. అయితే ఈ నిర్ణయం ఏళ్ల తరబడి పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వేలాదిమంది వయోవృద్ధులకు తీవ్ర నిరాశనే మిగిల్చింది. ప్రస్తుతం ఏడు రకాల పింఛన్లకు మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తుండగా, వృద్ధాప్య పింఛన్లను ఈ జాబితాలో చేర్చకపోవడం తో వృద్ధుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. గతంలో వృద్ధాప్య పింఛను వయోపరిమితిని తగ్గించినప్పటికీ అనేక మంది అర్హులకు అవకాశం దక్కలేదు. ఆన్‌లైన ఐడీలు ఓపెన్ కాకపోవడంతో వేలాది మంది అర్హులైన వృద్ధులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వం మారిన తర్వాతైనా తమకు అవకాశం వస్తుందని భావించిన వయోవృద్ధులకు ప్రస్తుతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడంతో వారు ఇప్పటికీ ఎదురు చూస్తున్నారు.ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మొదటి విడతగా ఏడు కేటగిరీల వారికి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, పైలేరియా, తలసేమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు మాత్రమే ప్రాధాన్యం కల్పించారు. కొత్త పింఛన్ల దరఖాస్తుకు రకరకాల ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి చేయడంతో జిల్లాల్లోని తహసీల్ కార్యాలయాలు, మీసేవా కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి దివ్యాంగుల పింఛను రూ. 4016, వితంతు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 2016 ప్రతినెలా అందిస్తున్నారు. వృద్ధాప్య పింఛన్ల దరఖాస్తులకు అవకాశం కల్పించకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన, మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినప్పటికీ ఆ దరఖాస్తుదారులకు నేరుగా పింఛన్ ఇస్తారా లేక మళ్లీ కొత్తగా అప్లై చేసుకోవాలా? అనే అంశంపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర అయోమయం నెలకొంది. అర్హులైన వారు ఈనెల 31లోపు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు లేదా వార్డు ఆఫీసర్లకు తమ దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఏసిబికి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

### 20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

**హైదరాబాద్,ఆగస్ట్18 :** నగరంలోని ఫూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అవినీతిపై ఏసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రభావతి.. రూ. 20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడింది. దీంతో ఆమెను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. ప్రభావతిపై కేసు నమోదు చేశారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే.. తమకు ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు ఏసీబీ అధికారులు సూచించారు. మరో వైపు అవినీతిని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నప్పటికీ సిబ్బందిలో ఎటువంటి మార్పు రావడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తరచూ ఎప్పుడో అక్కడ.. ఎప్పుడో అప్పుడు లంచం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులు ఏసీబీ అధికారులకు పట్టుబడుతున్నారు. తాజాగా ఫూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో అటువంటి ఘటనే చోటు చేసుకుంది.

# ఫర్నీచర్ దుకాణంలో అగ్నిప్రమాదం

### మంటల్లో చిక్కుకుని కార్మికుడు మృతి

**రాజన్నసిరిసిల్ల,ఆగస్ట్18 :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పెద్దూరు శివారులోని మహాలక్ష్మి ఫర్నీచర్ దుకాణంలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ కారణంగా భారీగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా 3 ÷ర్ ఇంజన్లతో సిబ్బంది దాదాపు మూడు గంటలకు పైగా శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ ప్రమాదంలో రాత్రి దుకాణంలో నిద్రించిన ఉత్తర్‌ప్రదేశ్‌కి చెందిన ఒక కార్మికుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ నాగేంద్ర చారి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డెడ్‌బాడీని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాదాపుగా 40 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# మద్యం మత్తులో యువకుడి దారుణ హత్య

### స్నేహితులే హత్య చేసినట్లు పోలీసుల గుర్తింపు

**రంగారెడ్డి,ఆగస్ట్18 :** రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మద్యం మత్తులో స్నేహితులే అతడిని కిరాతకంగా చంపేశారు. రివర్స్ కేఫ్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు బిహార్‌కు చెందిన అనికేత్‌గా గుర్తించారు. అనికేత్.. తన స్నేహితులు రోహిత్, రాహుల్, అంకిత్‌లతో కలిసి మద్యం సేవించాడు. ఈ సమయంలో స్నేహితుల మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. తీవ్ర ఆగ్రహానికి గురైన రాహుల్.. అనికేత్ తల వెనుక భాగంలో ఐరన్ రాడ్‌తో బలంగా కొట్టాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అపస్మారకస్థితిలో ఉన్న యువకుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే అనికేత్ మరణించినట్లు వైద్యులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణను వేగవంతం చేశారు.

# కాకతీయ కె హబ్ విద్యార్థులకు అవగాహన

### టి హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ

**వరంగల్,ఆగస్ట్18 :** కాకతీయ విశ్వవిద్యాలయ కే-హబ్ ఆధ్వర్యంలో ఎంపికైన విద్యార్థులకు టీ-హబ్ ప్రతినిధులతో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం విశ్వవిద్యాలయ సెనెట్‌హాల్‌లో నిర్వహించారు. కే-హబ్ డైరెక్టర్ ఆచార్య టీ సవితా జ్యోత్స్నసారథ్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా టీ-హబ్ ప్రతినిధి బాల మురళి భాస్కరన్ విద్యార్థులకు స్టార్టప్ మెంటార్‌షిప్, ఐడియా జనరేషన్, ఐడియా వ్యాలిడేషన్ తదితర అంశాలపై ఆచరణాత్మక శిక్షణ అందించారు. విద్యార్థులు తమ ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా ఎలా మలచుకోవాలి, ఒక ఆలోచనలోని కొత్తదనం, సృజనాత్మకత, సాధ్యాసాధ్యాలను ఎలా గుర్తించాలి అనే అంశాలను వివిధ ప్రత్యక్ష ఉదాహరణలతో వివరించారు. విద్యార్థులు స్టార్టప్‌లు, వ్యాపార ఆలోచనలకు సంబంధించిన పలు ప్రశ్నలను అడగగా, టీ-హబ్ ప్రతినిధులు వాటిని నివృత్తి చేశారు. ఆలోచనలను గుర్తించి, వాటికి సమర్థవంతమైన రూపకల్పన చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఇలాంటి 15 శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కే-హబ్ డైరెక్టర్ సవితా జ్యోత్స్న తెలిపారు. ఈ శిక్షణల ద్వారా విద్యార్థుల్లో వ్యాపార దృక్పథం, అంకుర సంస్థల స్థాపనపై అవగాహన, సృజనాత్మక ఆలోచనా శక్తి మరింత పెంపొందుతుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో కే-హబ్ సంయుక్త సంచాలకులు సిద్ధు, కిరణ్ పాల్గొన్నారు.

# వందేమాతరమంటే కాంగ్రెస్‌కు భయం: బండి

**హైదరాబాద్,ఆగస్ట్18 :** కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, ఖర్గే తీరుపై ప్రతి భారతీయుడు ఆశ్చర్యానికి లోనవుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో వందేమాతరం ఆలపించకుండా అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. వందేమాతరం ఆలపించడాన్ని చూసి ఒకప్పుడు బ్రిటీష్ వాళ్లు భయపడ్డారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ భయపడుతోందని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ వాళ్లకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య తేడా కనిపించడం లేదన్నారు. ఈ దేశంలో కాంగ్రెస్, ఎంఐఎం మాత్రమే వందేమాతరాన్ని వ్యతిరేకిస్తున్నాయని.. ఆ రెండు పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు.

# గాలే టెస్టుపై భారత్ పట్టు..

**విజయం దిశగా టీమిండియా**

**గాలే టెస్టులో శ్రీలంకపై పట్టు బిగించిన భారత్**

**372 పరుగుల లక్ష్య ఛేదనలో**

**84/4తో శ్రీలంక తడబాటు**

**రెండు వికెట్లతో రాణించిన**

**యువ స్పిన్నర్ మానవ్ సుతార్**

**సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలకు చెరో వికెట్**

**విజయానికి భారత్ 6 వికెట్ల దూరంలో..**

**లంకకు ఇంకా 288 పరుగులు అవసరం**




గాలే వేదికగా శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌పై భారత్ పూర్తి పట్టు సాధించింది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక 4 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసి కష్టాల్లో పడింది. విజయానికి టీమిండియా కేవలం 6 వికెట్ల దూరంలో నిలవగా, లంక గెలవాలంటే చివరి రోజు ఇంకా 288 పరుగులు చేయాల్సిన క్లిష్ట పరిస్థితిలో ఉంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శనతో నాలుగో రోజు ఆటలో టీమిండియా సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించింది. భారీ లక్ష్యాన్ని కాపాడుకునే క్రమంలో బౌలింగ్ ప్రారంభించిన భారత్‌కు పేసర్ మహమ్మద్ సిరాజ్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుతమైన శుభారంభం అందించారు. సిరాజ్ తన బౌన్సర్‌తో నిషాన్ మదుష్క (6)ను ఔట్ చేసి తొలి వికెట్ అందించగా, ఆ తర్వాతి ఓవర్లోనే మానవ్ సుతార్.. దినేష్ చండీమాల్ స్థానంలో కంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన పసిందు సూరియబండార (0)ను ఎల్బీడబ్ల్యూగా వెనక్కి పంపాడు. కొద్దిసేపటికే ప్రసిద్ధ్ కృష్ణ.. కమిందు మెండిస్ (2)ను కీపర్ క్యాచ్‌గా ఔట్ చేయడంతో శ్రీలంక 21 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో లహిరు ఉడార (16), కెప్టెన్ ధనంజయ డిసిల్వా కాసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. అయితే, మరోసారి బౌలింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ ఈ జోడీని విడదీసి తన రెండో వికెట్‌ను ఖాతాలో వేసుకున్నాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సోనాల్ దినుష (25 నాటౌట్)తో కలిసి ధనంజయ డిసిల్వా (31 నాటౌట్) పోరాడటంతో నాలుగో రోజు మరో వికెట్ పడకుండా లంక ముగించగలిగింది. వీరిద్దరూ అజేయంగా ఐదో వికెట్‌కు 37 పరుగులు జోడించారు. వెలుతురు మందగించడంతో అంపైర్లు ముందుగానే ఆటను నిలిపివేశారు. అంతకుముందు, నాలుగో రోజు ఆటను కొనసాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 193 పరుగులకు ఆలౌట్ అయింది. రిషబ్ పంత్ తనదైన శైలిలో దూకుడుగా ఆడి కేవలం 69 బంతుల్లో 66 పరుగులు చేశాడు. దేవదత్ పడిక్కల్ (44), కేఎల్ రాహుల్ (35) కూడా రాణించి జట్టుకు విలువైన పరుగులు అందించారు. దీంతో తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి భారత్.. శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. లంక బౌలర్లలో అసింత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 3 వికెట్లు పడగొట్టారు.

## పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రికి అర్జున అవార్డు

కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. అయితే, ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

### అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:

అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది)

తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్)

ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్)

నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్)

విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్)

లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ)

సుర్జీత్, పూజ (కబడ్డీ)

ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్)

ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్)

అరవింద్ సింగ్ (రోయింగ్)

అఖిల్ షెయోరాన్ (షూటింగ్)

అర్జున అవార్డు (జీవన సాఫల్యం)

అరుమై నాయగం (ఫుట్‌బాల్)

ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)

ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)

పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)

నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)

జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)

ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)

వీరేందర్ కుమార్ (రెజ్లింగ్)

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్

ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే

## కోహ్లీ జెర్సీ నంబర్.18 వెనుక ఇంత పెద్ద కథ ఉందా?




క్రికెట్ ప్రపంచంలో విరాట్ కోహ్లీ అనే పేరు ఒక బ్రాండ్. అతని ఆటతీరు ఎంతగా అభిమానులను ఆకట్టుకుంటుందో, అతని జెర్సీ నంబర్ 18 కూడా అంతే సుపరిచితం. అయితే, ఆ నంబర్ వెనుక ఒక యాదృచ్ఛిక కేటాయింపు, ఒక విషాదకర ఘటన, ఒక చారిత్రాత్మక ఆరంభం దాగి ఉన్నాయి. అది కేవలం ఒక అంకె కాదు, కోహ్లీ జీవితంలోని భావోద్వేగ ప్రయాణానికి ప్రతీక. కోహ్లీకి ఈ నంబర్‌ను తొలుత భారత అండర్-19 జట్టులో ఉన్నప్పుడు యాదృచ్ఛికంగా కేటాయించారు. అప్పుడు దానికి ప్రత్యేకత ఏమీ లేదు. కానీ, కాలక్రమంలో జరిగిన రెండు ప్రధాన సంఘటనలు ఆ నంబర్‌ను అతని జీవితంలో విడదీయరాని బంధంగా మార్చేశాయి. 2006 డిసెంబర్ 18... అప్పుడు కోహ్లీ వయసు 18 ఏళ్లు. ఢిల్లీ తరఫున కర్ణాటకతో రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడుతున్నాడు. ఆ రోజు రాత్రి అతని తండ్రి ప్రేమ్ కోహ్లీ గుండెపోటుతో ఆకస్మికంగా మరణించారన్న వార్త తెలిసింది. పుట్టెడు దుఃఖంలో ఉన్నప్పటికీ, జట్టు కష్టాల్లో ఉన్నందున మరుసటి రోజు బ్యాటింగ్ కొనసాగించాడు. కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును ఆదుకున్న తర్వాతే తండ్రి అంత్యక్రియలకు హాజరయ్యాడు. తండ్రిని కోల్పోయిన ఆ 18వ తేదీ, అతని జీవితంలో ఒక చేదు జ్ఞాపకంగా మిగిలిపోయింది. కట్ చేస్తే.. సరిగ్గా రెండు సంవత్సరాల లోపే అదే 18వ నంబర్ అతని జీవితంలోకి కొత్త వెలుగును తీసుకొచ్చింది. 2008 ఆగస్టు 18న శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ భారత సీనియర్ జట్టులోకి అరంగేట్రం చేశాడు. అతను ధరించిన జెర్సీ నంబర్ కూడా 18. తన జీవితంలో అత్యంత విషాదకరమైన రోజు, అత్యంత ముఖ్యమైన కెరీర్ ఆరంభం రోజు రెండూ 18వ తేదీనే రావడం ఒక 'కాస్మిక్' కనెక్షన్ అని కోహ్లీ స్వయంగా అభివర్ణించాడు. అప్పటి నుంచి తన తండ్రికి నివాళిగా, తన అరంగేట్రానికి గుర్తుగా కోహ్లీ ఎప్పుడూ ఆ నంబర్‌ను మార్చుకోలేదు.

భారత జట్టు తరఫున అన్ని ఫార్మాట్లలో, ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున అదే నంబర్‌తో బరిలోకి దిగుతున్నాడు. ఇప్పుడు 18వ నంబర్ జెర్సీ అంటే విరాట్ కోహ్లీ, విరాట్ కోహ్లీ అంటే 18వ నంబర్ జెర్సీ అనేంతగా అది అతని కెరీర్‌లో భాగమైపోయింది.




## టెస్టుల్లో రిషభ్ పంత్ చరిత్ర..


**100 సిక్సర్లు కొట్టిన తొలి భారత క్రికెటర్‌గా రికార్డు!**

టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ టెస్టు క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు బాదిన తొలి భారత బ్యాటర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలెలో జరుగుతున్న తొలి టెస్టులో ఈ ఘనత సాధించాడు. లహిరు కుమార బౌలింగ్‌లో భారీ సిక్సర్ కొట్టి పంత్ ఈ మైలురాయిని అందుకున్నాడు. పంత్ తనదైన ఆటతో ఈ రికార్డును సాధించాడు. కుమార వేసిన బంతిని ముందుకు వచ్చి లెగ్ సైడ్ వైపు భారీ షాట్ ఆడాడు. బంతి నేరుగా బౌండరీ దాటి సిక్సర్‌గా వెళ్లింది. దీంతో పంత్ టెస్టు కెరీర్‌లో 100 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. అదే సమయంలో టెస్టుల్లో తన 20వ అర్ధశతకాన్ని నమోదు చేశాడు. ఈ ఘనతతో పంత్ ప్రపంచ టెస్టు క్రికెట్‌లో అరుదైన జాబితాలో చేరాడు. టెస్టుల్లో 100 సిక్సర్లు కొట్టిన నాలుగో బ్యాటర్‌గా నిలిచాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ 138 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ బ్రెండన్ మెకల్లమ్ 107 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నాడు. పంత్ 100 సిక్సర్లతో మూడో స్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా దిగ్గజ వికెట్ కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ కూడా 100 సిక్సర్లు బాదాడు. టెస్టుల్లో పంత్ సిక్సర్ల వేగం కూడా ప్రత్యేకంగా నిలిచింది. అతడు 100 సిక్సర్లను 49.2 బంతులకు ఒకటి చొప్పున సాధించాడు. ఈ విషయంలోనూ పంత్ దూకుడు స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు ఏ భారత బ్యాటర్ కూడా టెస్టుల్లో 100 సిక్సర్ల మార్క్‌ను అందుకోలేదు. దీంతో పంత్ పేరు భారత క్రికెట్ చరిత్రలో ప్రత్యేకంగా నిలిచింది.

## మద్యం సేవించి డ్రైవింగ్.. డేవిడ్ వార్నర్‌కి జరిమానా

**ఇకపై కారు నడపాలంటే ఆ పరికరం తప్పనిసరి!**

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో చుక్కెదురైంది. ఈ కేసులో అతడిని దోషిగా తేల్చిన సిడ్నీ కోర్టు, 1500 ఆస్ట్రేలియన్ డాలర్ల (సుమారు రూ.1లక్ష) జరిమానా విధించింది. దీంతో పాటు అతను వాహనం నడపాలంటే కఠినమైన షరతులు విధించింది. గత ఏప్రిల్ 5న ఈస్టర్ ఆదివారం నాడు వార్నర్ (39) మద్యం సేవించి కారు నడుపుతూ పోలీసులకు చిక్కాడు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు కారు ఆపి, పక్క సీటులో ఉన్న ప్రయాణికుడితో సీటు మారేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని పరీక్షించగా,



చట్టబద్ధమైన పరిమితి కంటే రెండు రెట్లు ఎక్కువ మోతాదులో మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. నేడు ఈ కేసుపై సిడ్నీలోని వేవర్లీ స్థానిక కోర్టు తుది తీర్పును వెలువరించింది. విచారణ సందర్భంగా వార్నర్ తరఫు లాయర్ ఆసక్తికర వాదనలు వినిపించారు. ఈ కేసు మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడం వల్ల వార్నర్ ఇప్పటికే తీవ్రంగా నష్టపోయాడని, ఇది అతని వాణిజ్య అవకాశాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో టీ20 ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆడే అవకాశాలను దెబ్బతీస్తుందని కోర్టుకు తెలిపారు. అయితే, జడ్జి క్లేర్ ఫార్నాన్ ఈ వాదనలను తోసిపుచ్చారు. ప్రజల భద్రతకే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంఘటన జరిగినప్పుడు కారులో పిల్లలు కూడా ఉన్నారని, ఇది నేరం తీవ్రతను పెంచుతోందని వ్యాఖ్యానించి, శిక్షను ఖరారు చేశారు. కోర్టు ఆదేశాల ప్రకారం వార్నర్ ఇకపై తన కారుకు 'ఇంటర్‌లాక్ డివైస్' అమర్చుకుంటేనే డ్రైవింగ్ చేయగలడు. ఈ పరికరం డ్రైవర్ శ్వాసలో మద్యం ఉన్నట్లు గుర్తిస్తే కారును స్టార్ట్ కానివ్వదు.

# సంక్రాంతి బరిలో మెగా 158 మూవీ




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం మెగా158 నుంచి సినీ అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. అనుకున్న ప్లాన్ ప్రకారం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే దాదాపు 40 రోజుల చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. సినిమాకు సంబంధించి ఫస్ట్ హాఫ్ ఎడిటింగ్ దాదాపు పూర్తయి లాక్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ విజువల్ స్పెక్టాకిల్‌ను నిర్మిస్తోంది. మెగాస్టార్ పుట్టినరోజైన ఆగస్ట్ 22న సినిమా నుంచి అదిరిపోయే అఫీషియల్ అప్‌డేట్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. బాబీ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు ఉన్నాయి. మన శంకర వరప్రసాద్ గారు లాంటి బ్లాక్ బస్టర్, వాల్తేరు వీరయ్య లాంటి కాంబో కావడంతో ఈ సినిమా మీద కూడా ముందు నుంచి అందరి ఫోకస్ ఉంది. ఇప్పటికే సంక్రాంతికి అనిల్ రావిపూడి వెంకటేష్ కళ్యాణ్ రామ్ సినిమా. రవితేజ శ్రీవిష్ణు ఎంటర్‌టైనర్, శర్వానంద్- శ్రీనువైట్ల కాంబో చిత్రం, ప్రశాంత్ వర్మ 'మహాకాళి', సాయి దుర్గా తేజ్ సంబరాల ఏటిగట్టు సినిమాలు ఉండగా ఇప్పుడు మెగాస్టార్ సినిమా కూడా అదే సీజన్ మీద కన్నేయడంతో ఏం జరగనుంది అనేది చూడాలి.



# రాశి ఖన్నా స్టన్నింగ్ లుక్స్

టాలీవుడ్ అందాల భామ రాశి ఖన్నా సరికొత్త గ్లామరస్ ఫొటోషూట్‌తో సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఆమె అద్భుతమైన అందాలు, స్టైలిష్ లుక్స్ అభిమానులను కట్టిపడేస్తున్నాయి. వింటేజ్, వింటర్-చిక్ శైలిలో ఆమె పంచుకున్న ఈ లేటెస్ట్ పిక్స్ ప్రస్తుతం నెట్టింట విపరీతంగా వైరల్ అవుతున్నాయి. రాశి ఖన్నా గ్లామర్, ఆమె ఫ్యాషన్ సెన్స్ చూసి నెటిజన్లు లైకులు, కామెంట్ల వర్షం కురిపిస్తూ ఈ ఫొటోలను తెగ ట్రెండ్ చేస్తున్నారు. ఈ లేటెస్ట్ ఫొటోషూట్‌లో రాశి ఖన్నా ధరించిన దుస్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భుజాలపై నుండి జారిపడేలా డిజైన్ చేసిన ఎరుపు రంగు శాలువాను టాప్‌లా స్టైల్ చేయగా, దానికి మ్యాచింగ్‌గా హై-వేస్ట్ బ్లాక్ అండ్ వైట్ ప్లీటెడ్ చెకర్డ్ మిడ్డీ స్కర్ట్ ధరించారు. ఇక ఈ కలర్ కాంబినేషన్ ఆమెకు వింటాజ్ లుక్‌తో పాటు రాయల్ ఎలిగెన్స్ తెచ్చిపెట్టింది.


సాఫ్ట్ వేవీ హెయిర్, వార్మ్ బ్రాంజ్ మేకప్, ఫ్లష్ నూడ్ లిప్‌స్టిక్‌తో రాశి చాలా క్లాసీగా కనిపిస్తున్నారు. కెమెరా వైపు ఆమె చూస్తున్న తీరు, చూపులతోనే మాయ చేసేలా ఉంది. ఇక సౌత్ నుంచి నార్త్ వరకు అన్ని భాషల ప్రేక్షకులను తన నటనతో, అందంతో మెప్పిస్తున్న రాశి ఖన్నా, ఫ్యాషన్ విషయంలో ఎప్పటికప్పుడు కొత్త ప్రయోగాలు చేస్తూ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం రాశి ఖన్నా కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉంది. బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లలో ఆమె వరుసగా పెద్ద సినిమాల్లో నటిస్తున్నారు. రాశి ఖన్నా తమిళంలో 'అగత్య', తెలుగులో 'తెలుసు కదా' అలాగే వార్ డ్రామా '120 బహదూర్' సినిమాల్లో నటించి మెప్పించారు. పవన్ కళ్యాణ్‌తో కలిసి 'ఉస్తాద్ భగత్ సింగ్'లో కూడా నటించారు. ఇక రజనీకాంత్‌తో 'ధర్మన్' మూవీలో నటిస్తూ భారీ ప్రాజెక్టులను తన ఖాతాలో వేసుకున్నారు.




# ఇరుముడికి యూ/ఎ సర్టిఫికెట్

## రామ్‌చరణ్ గెస్ట్ రోల్ ప్రచారాలను ఖండించిన టీమ్

టాలీవుడ్ మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా సంచలన చిత్రం 'ఇరుముడి' థియేట్రికల్ విడుదలకు సర్వం సిద్ధం చేసుకుంది. దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ సినిమా 'యు/ఎ' సర్టిఫికేట్‌ను సొంతం చేసుకుంది. అలాగే సినిమా రన్‌టైమ్‌ను రెండు గంటల ఇరవై ఐదు నిమిషాల నిడివితో లాక్ చేసినట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రవితేజ పూర్తి భిన్నమైన, సరికొత్త పాత్రలో కనిపించనున్నారు. మధ్యతరగతి కుటుంబసభ్యుడిగా, కూతురు పాత్రలో నటించిన బేబీ నక్షత్రాతో ఆయన సాగే అనుబంధం ఈ సినిమాకు ప్రధాన భావోద్వేగ బలంగా నిలవనుంది. ముఖ్యంగా ఆల్కహాల్ వ్యసనంతో పోరాడే ఒక మధ్యతరగతి వ్యక్తి జీవితం, భవిష్యత్తులో అయ్యప్ప దీక్షను స్వీకరించి మాల ధరించిన తర్వాత ఎలాంటి ఆధ్యాత్మిక పరివర్తన చెందుతుందనే కోణంలో ఈ కథ సాగనుంది. గ్రామీణ వాతావరణం, సహజసిద్ధమైన లొకేషన్లు మరియు ఏజెన్సీ ప్రాంతాల నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని, ఇది ప్రేక్షకులకు ఒక కొత్త అనుభూతిని పంచుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సాయి కుమార్, అజయ్ ఘోష్, స్వసిక తదితరులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆగస్టు 21వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున గ్రాండ్ థియేట్రికల్ విడుదలకు సిద్ధమవుతోంది.



# అక్టోబర్ 2న రానున్న సందీప్ కిషన్ సిగ్మా

కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు సీఎం విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవు తున్న మోస్ట్ అంటిసిపేటెడ్ యాక్షన్ హీస్ట్ డ్రామా 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా అధికారిక విడుదల తేదీని ప్రకటించారు. గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2వ తేదీన ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన సరికొత్త పోస్టర్‌లో సందీప్ కిషన్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత ఇంటెన్స్ లుక్‌లో కనికట్టు చేస్తున్నారు. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, నూతన దర్శకుడి ప్రతిభకు తగ్గట్టుగా భారీ తారాగణం ఈ సినిమాలో భాగమైంది. ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు రాజు సుందరం, వర్సటైల్ యాక్టర్ సంపత్ రాజ్, శివ్ పండిట్, అన్బు దాసన్, యోగ్ జాపీ, షీలా రాజ్‌కుమార్ మరియు కిరణ్ కొండ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సాంకేతిక నిపుణుల విషయానికి వస్తే, స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్. థమన్ ఈ సినిమాకు అదిరిపోయే సంగీతం అందిస్తుండగా, కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు మరియు ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా విడుదల తేదీ ఖరారు కావడంతో, రాబోయే రోజుల్లో టీజర్, పాటలతో పాటు ప్రచార కార్యక్రమాలను వేగవంతం చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఇకపోతే ఈ సినిమాలో అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ అతిథి పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ సినిమాలో 'మల్లెపూల పల్లకి బంగారు పల్లకి' అంటూ సాగే పాటలో రామ్ చరణ్ అయ్యప్ప మాలధారణలో కనిపిస్తారని.. కొన్ని పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వీటిపై రామ్‌చరణ్ టీమ్ తాజాగా స్పందించింది. అవి రూమర్స్ అంటూ ఖండించింది. అసత్యాలను ప్రచారం చేయొద్దని విజ్ఞప్తి చేసింది.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342